1

నవతెలంగాణ

ఆదిలాబాద్

శనివారం | అక్టోబర్ 14, 2023 | www.navatelangana.com

ఆర్జీయూకేటీ అధ్యాపకులకు డాక్టరేట్లు

బాసర : ఆర్జీయూకేటీ యూనివర్సిటీలో ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విభాగంలో అతిథి అధ్యాపకులుగా పనిచేస్తున్న డాక్టర్ భూక్య రవికుమార్, డాక్టర్ రత్నకిషోర్‌కు ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి డాక్టరేట్(పీహెచ్‌డీ) ప్రకటించింది. ఈ సందర్భంగా శుక్రవారం యూనివర్సిటీ డైరెక్టర్ సతీష్‌కుమార్ మాట్లాడుతూ భూక్య రవి, భూక్య రత్నకిషోర్ పీహెచ్‌డీలు పొందడం ఎంతో సంతోషకరమన్నారు. కష్టపడే తత్వం, పట్టుదల, సాధించాలనే తపన, అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలనే కృషి ఉంటే విజయం సాధించవచ్చని తెలిపారు. ఆర్జీయూకేటిలో పనిచేస్తున్న అధ్యాపకులకు పరిశోధన రంగంలో ప్రోత్సహిస్తున్నామని, ఈ సంవత్సరం ముగ్గురు అధ్యాపకులు డాక్టరేట్ పొందారని పేర్కొన్నారు. డాక్టరేట్ పొందిన అధ్యాపకులను యూనివర్సిటీ ఉద్యోగులు అభినందించారు.



జోడేఘాట్ పంచాయతీ కార్యదర్శిని బదిలీ చేయాలి

కెరమెరి : మండలంలోని జోడేఘాట్ గ్రామ పంచాయతీ కార్యదర్శిని బదిలీ చేయాలని గ్రామస్తులు కోరారు. శుక్రవారం ఎంపీడీఓ మహేందర్‌ని కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం నాయకుడు రాజేశ్వర్ మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శి విధులకు సక్రమంగా హాజరు కావడం లేదని, ప్రతి నెల నిర్వహించాల్సిన గ్రామసభలను నిర్వహించడం లేదని తెలిపారు. భీం ఉత్సవ కమిటీ రివ్యూ సమావేశం నుండి నేటి వరకు విధులకు హాజరు కాలేదని ఆరోపించారు. గ్రామపంచాయతీ పరిధిలోని గ్రామ ప్రజల మధ్య గొడవలు సృష్టిస్తున్నారని ఆరోపించారు. వెంటనే పంచాయతీ కార్యదర్శిని బదిలీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కుమ్రం కేశవరావు, లక్ష్మణ్ పాల్గొన్నారు.



ఘనంగా గుండా మల్లేష్ వర్ధంతి



నవతెలంగాణ-రామకృష్ణాపూర్

సీపీఐ మాజీ శాసనసభ పక్షనేత, దివంగత నేత గుండా మల్లేష్ మూడవ వర్థంతిని ఆ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శుక్రవారం బెల్లంపల్లి పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బెల్లంపల్లి నియోజకవర్గ అభివృద్ధి, తెలంగాణ ఉద్యమంలో చేసిన పోరాటలను స్మరిస్తూ శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం పార్టీ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, పట్టణ కార్యదర్శి మిత్తపెల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ ఉమ్మడి ఆసిఫాబాద్ నియోజకవర్గ నుండి విడిపోయిన తర్వాత బెల్లంపల్లి నియోజకవర్గ నుండి తొలి ఎమ్మెల్యేగా గెలుపొందారన్నారు. సింగరేణిలో కార్మికుడిగా పని చేసి పేదల పక్షాన భూ పోరాటాలు చేశారని గుర్తు చేశారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారని, శాసనసభ పక్ష నేతగా ఢిల్లీలో వాదన్ని బలంగా వినిపించారన్నారు. కేంద్ర ప్రభుత్వంతో జరిగిన చర్చల్లోనూ పార్టీ శాసనసభ పక్ష నేత హోదాలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తో కలిసి పలుమార్లు హాజరయ్యారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు నక్క వెంకటస్వామి, పెండ్యాల కమలమ్మ, మారపల్లి రవి, రవీందర్, మోతే రాయలింగు, మామిడాల సత్తయ్య, మోతుకుల రాజు, కారుకూరి రాయలింగు పాల్గొన్నారు.

తెలంగాణ సంస్కృతికి బతుకమ్మ ప్రతీక

- జిల్లా ఇంటర్ విద్యాధికారి నైతం శంకర్
- ప్రభుత్వ కళాశాలలో ఘనంగా వేడుకలు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు బతుకమ్మ ప్రతీక అని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి నైతం శంకర్ అన్నారు. జిల్లా కేంద్రాల్లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన బతుకమ్మ వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బతుకమ్మ పండుగ ప్రతి ఒక్కరి ఇంట్లో సుఖశాంతులు నింపాలన్నారు. తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు ఆలవాలమైన బతుకమ్మను ఘనంగా నిర్వహించుకోవాలన్నారు. విద్యార్థులు, అధ్యాపకులు, తల్లిదండ్రులకు బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రామదాసు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ శ్రీనివాస్, అధ్యాపకులు శ్రీనివాస్, సంతోష్, సరిత, హరిదాస్, రజిత, జ్యోతి, సిబ్బంది రమ్య, సక్కుబాయి, లలిత, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న మద్యం పట్టివేత



నవ తెలంగాణ-సారంగాపూర్

మండలం మలక్ చించోలి గ్రామంలో ఎస్సై కృష్ణ సాగర్ నేతృత్వంలో శుక్రవారం వాహనాల తనిఖీలు చేపట్టారు. వాహనంలో అక్రమంగా తరలిస్తున్న రూ.30వేల మద్యం స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల కోడ్ అమలవుతున్న సందర్భంగా డబ్బులు, మద్యం తరలిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

జైనథ్ : రాష్ట్రంలోఎన్నికల కోడ్ అమలులోకి రాగా పోలీసులు మండలంలోని పలు గ్రామాల్లో తనిఖీలు చేపట్టారు. శుక్రవారం మండలంలోని గిమ్మ, మేడిగూడ, జామ్ని, మాంగుర్ల, పార్డీ-కే, కంఠ, ఆడ గ్రామాల్లో సీఐ కోల నరేష్, ఎస్సై పురుషోత్తం తమ బృందంతో తనిఖీలు చేశారు. అక్రమంగా మద్యం అమ్ముతున్న వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి మద్యాన్నీ స్వాధీనం చేసుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు స్వల్పగాయాలు

నవతెలంగాణ-లక్ష్మణచాంద

మండలంలోని బాబాపూర్ ఎక్స్ రోడ్ వద్ద రోడ్డు ప్రమాదంలో దంపతులకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం..కడెం మండలం ఎలగడప గ్రామానికి చెందిన సందారం కవిత - శ్రీనివాస్ దంపతులు ఖానాపూర్ నుండి నిర్మల్‌కు కారులో వెళ్తున్నారు. బాబాపూర్ ఎక్స్ రోడ్ వద్ద కారు అదుపు తప్పి బోల్తా పడింది. గమనించిన స్థానికులు వారి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి నిర్మల్ ఆస్పత్రికి తరలించారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

నవతెలంగాణ-ముధోల్

మండల కేంద్రంతో పాటు ఎడ్‌బీడ్, కారేగాం గ్రామాల్లో పేకాట ఆడుతున్న వారిని పోలీసులు పట్టుకున్నారు. శుక్రవారం ముందస్తు సమాచారంతో బహిరంగ ప్రదేశాల్లో పేకాట ఆడుతుండగ దాడి చేసి 21 మందిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై కిరణ్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.46 వేలను స్వాధీనం చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

కుమురంభీం జిల్లా ఎస్పీని మార్చాలి

- క్రిమినల్స్‌ను రక్షిస్తున్న ఎస్పీ : ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆరోపణ
- ఎన్నికలు ప్రజాస్వామ్య బద్దంగా జరిగేలా ఈసీ చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కుమురంభీం జిల్లా ఎస్పీ కే. సురేష్ కుమార్ అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని, ఆయన్ను బదిలీ చేయాలని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ కేంద్ర ఎన్నికల సంఘాన్ని కోరారు. శుక్రవారం పట్టణంలోని బీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సిర్పూర్‌లో రౌడీయిజం, గుండాయిజం చేస్తున్న ఎమ్మెల్యే కోనప్పకు కొమ్ము కాస్తూ ఎస్పీ శాంతిభద్రతలను మంటగలుపుతున్నారని విమర్శించారు. ప్రతి విషయంలోనూ బీఎస్పీ నేతలపై అక్రమ కేసులు పెడుతూ ఎమ్మెల్యే మెప్పుకోసం ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. ఎస్పీ పర్యవేక్షణలో సిర్పూర్‌లో ఎన్నికలు సజావుగా జరుగుతాయన్న నమ్మకం తమకు లేదన్నారు. పోలీస్ అధికారుల చేతగానితనం వల్ల స్థానిక ప్రజలు భయాందోళనకు గురవుతున్నారన్నారు. జిల్లా ఎస్పీ సురేష్ కుమార్ సిర్పూర్ ఎమ్మెల్యే కోనప్పకు అనుకూలంగా వ్యవహరించనట్లయితే తన నిజాయితీ నిరూపించుకోవాలన్నారు. ఎస్పీ కాల్ డాటా బహిర్గతం చేస్తే ఎమ్మెల్యే, తన అనుచరులతో ఎన్ని సార్లు మాట్లాడారో తెలుస్తుందన్నారు. జిల్లా ఎస్పీ కొనసాగితే ఎన్నికలు ప్రజాస్వామ్య బద్దంగా జరగవని జాతీయ ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయనున్నట్టు తెలిపారు. నియోజకవర్గంలో పోలీసలంటే క్రిమినల్స్‌కు భయం లేదని అరాచక శక్తులతో పోలీసులు తిరుగుతున్నారని ఆరోపించారు. కేంద్ర ఎన్నికల సంఘం సీనియర్ ఐపీఎస్ అధికారులతో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి సిర్పూర్‌లో ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎమ్మెల్యే కోనేరు కోనప్ప చింతలమానెపెల్లి మండలంలో మాట్లాడిన భాషా పూర్తి నీచమైనదన్నారు. తెలంగాణ ప్రజలను అవమానించేలా మాట్లాడడం ఆయన అహంకారానికి నిదర్శనమన్నారు. ఎన్నికల నియమావళి అమలులో ఉన్నప్పటికీ తన అధికార బలంతో కొంతమందికి దొడ్డిదారిన ప్రభుత్వ ఫలాలు అందజేస్తానంటూ మాయమాటలు చెప్పి తమ పార్టీలో చేర్చుకుంటున్నారని ఆరోపించారు. బీఎస్పీ కార్యాలయాలకు అద్దె భవనాలు ఇచ్చేందుకు ముందుకు వస్తున్న యజమానులను ఎమ్మెల్యే అనుచరులు బెదిరిస్తున్నారని ఆరోపించారు. రాజకీయ కక్షలతోనే బీఎస్పీ నేతలపై అక్రమంగా ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయిస్తున్నారని దుయ్యబట్టారు. కోనప్ప పదేళ్ల పాలనలో సిర్పూర్ ప్రజల బతుకులు శిథిలమైపోయాయన్నారు. ఎస్పీఎం కార్మికులకు రూ.35 వేల బోనస్ ఇస్తానన్న ఎమ్మెల్యే హామీ ఏమైందని ప్రశ్నించారు. ఏ మొహం పెట్టుకొని ప్రజలను ఓట్లు అడగడానికి వస్తున్నారో ఎమ్మెల్యే సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. నియోజవర్గంలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వడంలో, త్రాగునీటి సౌకర్యం కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలం అయిందన్నారు. ఈ సమావేశంలో బీఎస్పీ రాష్ట్ర కార్యనిర్వాహక కమిటీ కార్యదర్శి అర్షద్ హుస్సేన్, అసెంబ్లీ అధ్యక్షులు డోకే రాజన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం ప్రవీణ్, జిల్లా మహిళా కన్వీనర్ సిడాం జ్యోతి, ముస్తఫీజ్ హుస్సేన్, తస్నీరు పోచం, షబ్బీర్ హుస్సేన్, సీతానగర్ ఎంపీటీసీ జామున మహేష్, నక్క మనోహర్, సిద్ధం శ్రీనివాస్ పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

ఇంటర్మీడియట్‌లో విద్యాభివృద్ధికి కృషి చేయాలి

- డీఐఈఓ నైతం శంకర్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో ఇంటర్మీడియట్‌లో విద్యాభివృద్ధికి అథితి అధ్యాపకులు కృషి చేయాలని డీఐఈఓ నైతం శంకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో జిల్లాలో పనిచేస్తున్న అతిథి అధ్యాపక సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్‌లో విద్యాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. అతిథి అధ్యాపకులు మిగతా అధ్యాపకులతో సమానంగా పనిచేస్తున్నారని, వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని, ఉన్నతాధికారుల దృష్టికి సమస్య తీసుకువెళ్తానన్నారు. ఇదే జిల్లాలో పుట్టి పెరిగి ఇక్కడే జిల్లా విద్యాధికారిగా పనిచేయడం సంతోషంగా ఉందన్నారు. అంతకు ముందు సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ తమకు పెండింగ్ వేతనాలు చెల్లించడంతో పాటు నెలవారీ వేతనం వచ్చేలా చూడాలన్నారు. సంవత్సరంలో 9 నెలలు మాత్రమే కాకుండా 12 నెలలు జీతం ఇచ్చి, ఆటో రెన్యువల్ వచ్చేలా ప్రభుత్వం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు కృష్ణమూర్తి, సత్యనారాయణ, రాంబాబు, లింగమూర్తి, సుశీల్, సునీల్, సరళ, దీపక్, ఉదయశ్రీ, జ్యోతి, అశోక్, మహేశ్, జిజేఎల్ఏ సంఘం నాయకులు శ్రీనివాస్, సంతోష్ పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ పబ్లిక్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌అర్బన్

ఓపెన్ స్కూల్ సొసైటీ ద్వారా జిల్లాలో నిర్వహించనున్న పదవ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా విద్యాశాఖ అధికారి టి. ప్రణీత అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షలకు 324, ఇంటర్మీడియట్ పరీక్షలకు 165 మంది అభ్యాసకులు హాజరవుతారన్నారు. సంబంధిత పరీక్ష నిర్వహణ అధికారులు పరీక్షలకు కావాల్సిన ఏర్పాట్లను పూర్తి చేయాలని సూచించారు. ఈ నెల 16 నుంచి 26 వరకు ఉదయం 9 గంటల నుంచి, మధ్యాహ్నం 12 గంటల వరకు, అలాగే మధ్యాహ్నం 2 గంటల నుంచి 5గంటల వరకు పరీక్షలు ఉంటాయన్నారు. పదవ తరగతికి రెండు ఇంటర్మీడియట్‌కు ఒక పరీక్ష కేంద్రాలను జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేశామన్నారు. ఈ పరీక్షలకు హాజరయ్యే అభ్యాసకులు అరగంట ముందుగా పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. అభ్యాసకులు తమ వెంట ఎలాంటి పుస్తకాలు, గణన యంత్రాలు, ఎలక్ట్రానిక్ వస్తువులు, సెల్ ఫోన్లు పరీక్ష హాల్లోకి తీసుకురావద్దని సూచించారు. కేవలం పరీక్ష ప్యాడ్, పెన్నులను మాత్రమే వెంట తీసుకొని రావాలని, పరీక్ష కేంద్రాలలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని పేర్కొన్నారు. అలాగే ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు ఈ నెల 30 నుంచి ప్రారంభమవుతాయని, ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల(బాలికలు)లో నిర్వహించబడతాయని పేర్కొన్నారు. సమావేశంలో పరీక్ష నిర్వహణ అధికారులు (సిఎస్అండ్‌డిఓ), ఓపెన్ స్కూల్ జిల్లా కోఆర్డినేటర్ ఎస్. అశోక్, వేణుగోపాల్ పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికులకు లాభాల్లో వాటా ఇవ్వాలి

- సింగరేణి కాంట్రాక్టు కార్మిక రాష్ట్ర అధ్యక్షులు దూలం శ్రీనివాస్



కార్మికులతో దూలం శ్రీనివాస్

నవతెలంగాణ - కాసిపేట

సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు లాభాల్లో వాటా ఇవ్వాలని సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సంఘం(సిఐటియు) రాష్ట్ర అధ్యక్షులు దూలం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శుక్రవారం మందమర్రి ఏరియా కాసిపేట అండర్ గ్రౌండ్ మైన్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల గేట్ మీటింగ్ రాజేష్ అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరై శ్రీనివాస్ మాట్లాడారు. సింగరేణి వ్యాప్తంగా పనిచేస్తున్న 30వేల సింగరేణి కాంట్రాక్టు కార్మికుల శ్రమను గుర్తించి, వారి వేతనాలను పెంచడంలో, అగ్రిమెంటులోని అంశాలను అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, సింగరేణి యాజమాన్యం మొండిగా వ్యవహరిస్తున్నాయన్నారు. 10సంవత్సరాలు గడుస్తున్నా కనీస వేతనాల జీవోలను విడుదల చేయకుండా వెట్టి చాకిరీ చేయిస్తూ కోట్ల రూపాయల లాభాలను గడిస్తున్నారని, 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ.2222 కోట్ల రూపాయలు సింగరేణి లాభాలను గడించిందని తెలిపారు. ఈ లాభాల్లో కాంట్రాక్టు కార్మికుల శ్రమ లేదా? అని ప్రశ్నించారు. ప్రతి సంవత్సరం కాంట్రాక్టు కార్మికుల శ్రమతో లాభాలు పెంచుకుంటున్న యాజమాన్యం వారి కష్టాన్ని మాత్రం గుర్తించడం లేదన్నారు. పర్మినెంటు కార్మికులకు ఇచ్చే విధంగా కాంట్రాక్టు కార్మికులకు కూడా లాభాలలో వాటా చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్టు కార్మికుల విషయంలో వివక్ష చూపిస్తోందని, 2021 జూన్‌లో రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెం 22ను ఏళ్లు గడుస్తున్నా నేటికీ గెజిట్ చేయకుండా కార్పొరేటర్ల కొమ్ము కాస్తూ కార్మికుల పొట్ట కొడుతోందని పేర్కొన్నారు. వెంటనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి కాంట్రాక్టు కార్మికుల వేతనాలను పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాజేష్, సాయి, రమేష్, మహేష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పేద ప్రజల పార్టీ

టీపీసీసీ మెంబర్ కోరళ్ల కృష్ణారెడ్డి

నవతెలంగాణ - సిర్పూర్(టి)

కాంగ్రెస్ పేద ప్రజల పార్టీ అని టీపీసీసీ మెంబర్ కోరళ్ల కృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం వేంపల్లి గ్రామంలో పార్టీ కార్యాలయంలో నియోజకవర్గంలో ఉన్న వివిధ గ్రామాల యువకులు కాంగ్రెస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారికి కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం సిర్పూర్ మండలకేంద్రంలో వ్యాపార దుకాణదారులకు, ప్రజలకు మహాలక్ష్మీ, రైతు బరోసా, గృహ జ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు, యువ వికాసం, చేయూత గ్యారెంటీ కార్డులో ఉన్న స్కీంల గురించి వివరిస్తూ వారికి గ్యారెంటీ కార్డులను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 10 సంవత్సరాల కాలంలో సామాన్య ప్రజల బ్రతుకులను ఆగమాగం చేశాయని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పుడు ధరలు అందరికి అనుకూలంగా ఉండేవని, కానీ ప్రభుత్వాలు అధికంగా పెంచి నట్టేట ముంచాయని, అందుకే ఈ ప్రభుత్వాలను కూలగొట్టి తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్‌కు ఒక అవకాశం ఇవ్వాలని కోరారు. ఆయన వెంట బెజ్జూర్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాచకొండ శ్రీవర్ధన్, సిర్పూర్ మండల అధ్యక్షుడు శంషొద్దీన్, చింతలమానేపెల్లి, పెంచికల్‌పేట్ మండలాల అధ్యక్షులు నికాడె వెంకటేశ్, అతహాబేగ్, ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు అల్లూరి రాజు, నాయకులు తేజారెడ్డి, శ్రీకాంత్, శైలేష్, అఖిల్, ఇబ్రాయిల్, రైస్‌హైమద్ ఉన్నారు.



ప్రచారం నిర్వహిస్తున్న కోరళ్ల కృష్ణారెడ్డి, నాయకులు

గుట్టుగా తరలిస్తున్న గుడుంబా పట్టివేత



నవతెలంగాణ-దిలావర్‌పూర్

నర్సాపూర్(జి) మండలంలోని నందన్ తండా గ్రామంలో గుట్టుగా గుడుంబా తయారు చేసి అమ్మకానికి తరలిస్తుండగా శుక్రవారం పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం నందన్ తండాకు చెందిన రాథోడ్ రవీందర్ కొన్నాళ్లుగా తన ఇంటి వద్ద అక్రమంగా గుడుంబా తయారు చేస్తున్నాడు. గుడుంబాని అమ్మడానికి తీసుకెళ్తుండగా పోలీసులు పట్టుకున్నారు. రూ. 3,600 విలువగల 12 లీటర్ల గుడుంబాని స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై తెలిపారు. గుడుంబా తయారు చేసిన, విక్రయించిన చట్టరీత్యా నేరామన్నారు. పట్టుబడిన వ్యక్తి పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పేర్కొన్నారు.

బెజ్జూర్ : మండలంలోని సిద్ధాపూర్, బెజ్జూర్ గ్రామాల్లో గుడుంబా అమ్ముతున్న ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై విక్రమ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైన గుడుంబా అమ్మిన, తయారుచేసిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పోలీసుల విధులకు సహకరించిన ఎమ్మెల్యే

జైనథ్ : ఎన్నికల నేపథ్యంలో జిల్లా సరిహద్దున ప్రత్యేకంగా చెక్ పోస్టులు ఏర్పాటు చేసి ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. అందులో భాగంగానే పిప్పర్‌వాడ టోల్ ప్లాజా గుండా బంధువుల ఇంటి నుండి ఆదిలాబాద్ వస్తున్నా ఎమ్మెల్యే జోగురామన్న వాహనాన్ని సైతం పోలీసులు తనిఖీలు చేశారు. పోలీసు అధికారులు, సిబ్బందికి ఎమ్మెల్యే సహకరించగా... వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. పోలీసుల విధులకు ఆటంకం కలగకుండా ఎమ్మెల్యే వాహనం పరిశీలనకు సహకరించారు. అక్రమ రవాణాను అడ్డుకోవడమే లక్ష్యంగా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసిన నేపథ్యంలో పోలిసుల పనితీరు పట్ల ఎమ్మెల్యే అభినందనలు తెలియజేశారు. ఇదే స్పూర్తితో ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో, సజావుగా పూర్తయ్యేలా చూడాలని సూచించారు. ఎమ్మెల్యే వెంటా పాకాల రామచందర్, మాజీ మార్కెట్ చైర్మెన్ మెట్టు ప్రహ్లాద్, కారింగుల ప్రణయ్ ఉన్నారు.



నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

పట్టణంలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్ కో టౌన్ ఏఈ కమలాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పట్టణంలోని 33/11 కేవీ సబ్ స్టేషన్ల నెలవారి మరమ్మత్తుల కారణంగా ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం 2.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
శనివారం | అక్టోబర్ 14, 2023 | www.navatelangana.com

గ్రామపంచాయతీ రికార్డుల తనిఖీ

నవతెలంగాణ-కడెం

మండలంలోని నచ్చన్ఎల్లాపూర్ గ్రామపంచాయతీ రికార్డులను ఎంపీఓ ఉపేందర్ శుక్రవారం తనిఖీ చేశారు. గ్రామంలోని జనన, మరణ, ఇంటి పన్నులు, వివాహ రిజిస్టర్, గ్రామ సభ రికార్డులు, క్యాష్ బుక్ గ్రామంలో జరిగిన అభివృద్ధి ఎంబీ రికార్డులను తనిఖీలు చేశారు. అనంతరం పంచాయతీ కార్యదర్శికి సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బొడ్డు గంగన్న, కార్యదర్శి రమాదేవి, కారోబారి మహేందర్ పాల్గొన్నారు.



నిర్మల్ జిల్లా నూతన కలెక్టర్‌గా ఆశిష్ సంగ్వాన్



నవతెలంగాణ-నిర్మల్

నిర్మల్ జిల్లా నూతన కలెక్టర్‌గా ఆశిష్ సంగ్వాన్ శుక్రవారం నియమితులయ్యారు. కేంద్ర ఎన్నికల కమిషన్ రెండు రోజుల క్రితం జిల్లా కలెక్టర్ వరుణ్ రెడ్డిని బదిలీ చేయడంతో, ఆ స్థానంలో నూతన కలెక్టర్‌గా ఆశిష్ సంగ్వాన్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఉత్తర్వులు జారీ చేశారు.

పాఠశాలల్లో ఘనంగా ముందస్తు బతుకమ్మ సంబురాలు



ఆదిలాబాద్‌టౌన్ : బతుకమ్మలతో పాలిటెక్నిక్ విద్యార్థినులు, అధ్యాపకులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ముందస్తు బతుకమ్మ సంబరాలు జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరుగుతున్నాయి. ప్రభుత్వ, ప్రయివేట్ విద్యాసంస్థల్లో విద్యార్థులు సాంప్రదాయ దుస్తులు ధరించి రంగురంగు పువ్వులతో అందంగా బతుకమ్మలను పేర్చి తీసుకువచ్చి వాటి చుట్టూ తిరుగుతూ ఆడిపాడారు. పట్టణంలోని ప్రభుత్వ సంజయ్ గాంధీ పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం ముందస్తు బతుకమ్మ వేడుకలకు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినీ, విద్యార్థులు సంప్రదాయ వస్త్రాలు ధరించి తీరొక్క పూలతో బతుకమ్మను అలంకరించి పూజలు చేశారు. అనంతరం అధ్యాపకులతో కలిసి బతుకమ్మ పాటలపై నృత్యాలు చేశారు. తెలంగాణలో బతుకమ్మ పండుగకు ఎంతో విశిష్టత ఉందని ప్రిన్సిపాల్ భరద్వాజ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల విభాగాధిపతులు రాజ్ కుమార్, క్రాంతి కుమార్, సుజయ్, రాజన్న, సురేష్, అనిల్ కుమార్ చౌహన్, అధ్యాపకులు శ్రీనివాస్, విజయలక్ష్మి, యశశ్రీ, జ్యోత్స్నారాణి, హేమలత, సంగీత, రామేశ్వర్‌రెడ్డి, రవికుమార్, నీల్ కమల్, గజానంద్‌రావు, విద్యార్థులు పాల్గొన్నారు.

అదేవిధంగా డిగ్రీ కళాశాలల్లో బతుకమ్మ సంబురాలు ఘనంగా నిర్వహించారు. అందులో భాగంగా శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో అలాగే ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలలో బతుకమ్మ సంబురాలను నిర్వహించారు. ఈ సందర్భంగా తీరొక్క పూలతో బతుకమ్మను పేర్చి కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు కోలాహలంగా బతుకమ్మను ఆడి పాడారు. బతుకమ్మ పాటలతో కళాశాల విద్యార్థులు నృత్యాలు చేస్తూ అలరించారు. కార్యక్రమంలో ఇరు కళాశాలల ప్రిన్సిపాల్‌లు డా.జలగం అనిత, ఏ.శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్‌లు అధ్యాపకులు, విద్యార్థులు ఉన్నారు.

బేల : మండలంలోని కీర్తన డిగ్రీ కళాశాలలో శుక్రవారం బతుకమ్మ సంబరాలు ఘనంగా జరిగాయి. విద్యార్థులు రంగురంగు పువ్వులతో బతుకమ్మలను తయారు చేసి తీసుకువచ్చారు. విద్యార్థులతో కలిసి అధ్యాపకులు కలిసి బతుకమ్మల చుట్టూ తిరుగుతూ పాటలు పాడుతూ నృత్యాలు చేశారు. ఈ సందర్భంగా కళాశాల సాంస్కృతిక విభాగం ఇన్‌ఛార్జి మహిళ అధ్యాపకురాలు పుష్ప మాట్లాడుతూ తొమ్మిది రోజులు తొమ్మిది రూపాల్లో అమ్మ వారికి పుజాలు చేస్తారని, మొదటి రోజు ఎంగిలి మొదలుకొని చివరి రోజు సద్దుల బతుకమ్మగా పూజలు నిర్వహిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డా. వరప్రసాద్, మహిళ అధ్యాపకురాళ్లు సౌందర్య, ప్రియాంక, బిందు, విజయ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇచ్చోడ : మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బతుకమ్మ పండుగ వేడుకను ఘనంగా నిర్వహిచారు. విద్యార్థినులు సాంప్రదాయ దుస్తులు ధరించి, వివిధ రకాల పూలతో బతుకమ్మలను ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం కళాశాల ఆవరణలో అధ్యాపకురాళ్ల బృందంతో కలిసి బతుకమ్మ ఆడారు. అనంతరం స్థానిక చెరువులో నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జె.గణేష్, అధ్యాపకులు సత్యనారాయణ, ప్రభాకర్‌రెడ్డి, రాజేశ్వర్, జూనియర్ అసిస్టెంట్ పురుషోత్తం పాల్గొన్నారు.



ఇచ్చోడ : బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు, అధ్యాపకులు

కానిస్టేబుల్‌గా ఎంపికైన అభ్యర్థులకు సన్మానం



నవతెలంగాణ-తాంసి

కానిస్టేబుల్‌గా ఎంపికైన అభ్యర్థులు సాయి చరణ్‌రెడ్డి, బట్టు రాహుల్ కప్పర్ల గ్రామానికి చెందిన సాయిలను శుక్రవారం మండల కేంద్రంలోని రామేశ్వర అలయంలో అభ్యర్థులకు చదువు నేర్పిన గురువైన బెల్లపు గంగారాం కానిస్టేబుల్ ఉద్యోగం పొందిన అభ్యర్థులను గ్రామసర్పంచ్‌తో పాటు గ్రామ పెద్దలు శాలువాతో సన్మానించి అభినందించారు ఈ సందర్భంగా గంగారాం మాట్లాడుతూ నేను మండల కేంద్రంలో ఉన్న ప్రయివేటు పాఠశాలను నెలకొల్పడం జరిగింది. మా పాఠశాలలో చదువుకొని ఉన్నత చదువుల మంచి ప్రతిభ కనబర్చి పోలీస్ ఉద్యోగం సాధించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ స్వప్న రత్న ప్రకాష్, గ్రామస్తుల గోవర్ధన్‌రెడ్డి కాంతరెడ్డి, రామన్న యాదవ్, అరుణ్, మహేందర్‌రెడ్డి, కళ్యాణ్ ఉన్నారు.

కాంగ్రెస్ ఆరు గ్యారంటీల ప్రచారం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌అర్బన్

గడప గడపకు కాంగ్రెస్ ఆరు గ్యారంటీ పథకాలు శుక్రవారం దుర్గానగర్‌లో ప్రచారం నిర్వహించారు. అందులో భాగంగా పట్టణ కాంగ్రెస్ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రచార కార్యక్రమంలో కార్యకర్తలు, నాయకులు ఉదయం నుంచి ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆరు గ్యారంటీ పథకాలతో కూడిన కరపత్రాలను ఇంటింటికీ అందిస్తూ ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షులు గుడిపెల్లి నగేష్, కౌన్సిలర్ అశోక్, నాయకులు వసీం, లింగన్న, మోతీరాం, వెంకన్న, నాందేవ్, శివాజీ, అశోక్‌గౌడ్, సాదిక్, షాకీర్, దత్తు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



నవతెలంగాణ-బోథ్

మండల కేంద్రానికి చెందిన మాజీ సర్పంచ్ బంగారపు సునీత భర్త ఇటీవల అనారోగ్యంతో మరణించారు. శుక్రవారం విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్ జాదవ్ వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట జెడ్పీటీసీ సంధ్యారాణి, సర్పంచ్ సురేందర్ యాదవ్, కన్వీనర్ నారాయణరెడ్డి, నాయకులు ప్రశాంత్, మల్లెపూల సుభాష్, లింగారెడ్డి, ఇమ్రాన్, బిరం రవి, షేక్ ముబీన్, అల్లం వినయ్, పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



నవతెలంగాణ-బోథ్

మండలంలోని సొనాల, కౌట(బి), ఘన్‌పూర్, గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను శుక్రవారం ఐటీడీఏ పీఓ బోథ్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి చాహత్ బాజ్‌పాయ్ పరిశీలించారు. అలాగే పోలింగ్ కేంద్రాలలో గదులు వసతులపై అధికారులకు సూచించారు. అనంతరం ఘన్‌పూర్ అంతర్‌రాష్ట్ర సరిహద్దు చెక్ పోస్ట్‌ను సందర్శించారు. ఆమె వెంట రెవెన్యూ, పోలీస్ సిబ్బంది, ఎన్నికల అధికారులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరపరాలో అంతరాయం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

నెలవారి మరమ్మతుల కారణంగా ఆదిలాబాద్ మండలంలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అసిస్టెంట్ ఇంజనీర్ తిరుపతిరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండల పరిధిలోని బంగారుగూడ, పిప్పల్‌ధరి, అంకోలి సబ్ స్టేషన్ల పరిధిలో ఉదయం 11:00 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు. సబ్ స్టేషన్ల పరిధిలోని వినియోగదారులందరూ సహకరించాలని కోరారు.

అక్రమంగా తరలిస్తున్న నగదు స్వాధీనం

నవతెలంగాణ-దిలావర్‌పూర్

ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నేపథ్యంలో పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు. మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో శుక్రవారం వాహనాలను తనిఖీ చేస్తూ ఆధారాలు లేని డబ్బులను స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై యాసిర్ అరాఫత్ తెలిపిన వివరాల ప్రకారం... రాజేశ్వర్ అనే వ్యక్తి వద్ద రూ.8 లక్షల 94 వేల 233 నగదును స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. అనంతరం సీఐ శ్రీనివాస్ సమీక్షంలో పంచనామా నిర్వహించి కలెక్టరేట్‌లోని ఎలక్షన్ సెల్‌లో జమచేస్తామన్నారు.

డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్‌డే వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా కళాశాల ప్రిన్సిపాల్ ఎం. శ్రీనివాస్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో నడుచుకోవాలని సీనియర్ జూనియర్ ఒకరికి ఒకరు సహకరించుకోవాలన్నారు. భవిష్యత్‌లో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాక్షించారు. ఈ సందర్భంగా డీజె సినీ పాటల మధ్య విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. పలువురు విద్యార్థులు చేసిన నృత్య ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. వేడుకలలో విద్యార్థుల కేరింతలతో కళాశాల ప్రాంగణం సందడిగా మారింది. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజనులు అన్ని రంగాల్లో రాణించాలి



నవతెలంగాణ-నార్నూర్

గిరిజనులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని బంజారా యువసేన మండల అధ్యక్షుడు జాదవ్ దత్త అన్నారు. శుక్రవారం మండలంలోని నాగల్‌కొండ గ్రామానికి చెందిన జాదవ్ అనికేత్ రాష్ట్ర స్థాయి ఏకలవ్య సంస్కృతిక, జాతీయ స్థాయి పోటీలో సోలో ఇన్స్‌ట్రుమెంటల్ బాలుర విభాగంలో ప్రథమ స్థాయి బహుమతి సాధించాడు. విషయం తెలుసుకున్న యూత్ సభ్యులు శుక్రవారం విద్యార్థినీ శాలువాతో సన్మానించి అభినందించారు. భవిష్యత్తులో మంచి ప్రతిభను కనబర్చాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో యూత్ సభ్యులు జాదవ్ అర్జున్, జాదవ్ రమేష్, రాథోడ్ జితేందర్, బంజారా యువసేన సభ్యులు ఉన్నారు.

ప్రతి ఒక్కరూ సన్మార్గంలో నడువాలి

- ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్ జాదవ్



నవతెలంగాణ-బోథ్

ప్రతి ఒక్కరూ సన్మార్గంలో నడవాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్ జాదవ్ అన్నారు. శుక్రవారం మండలంలోని గుర్రాలతండ గ్రామ జిన్నింగ్‌లో నిర్వహించిన సప్త కార్యక్రమానికి నియోజకవర్గ పార్టీ ఇన్‌ఛార్జి మాజీ మంత్రి గొడం నగేష్, ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్ జాదవ్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే యశస్వి శ్రీ సంత్ దక్షిణ్‌జీ మహారాజ్, బృందావన్ ఆశీర్వాదాలు తీసుకొని సభ్యులు మాట్లాడుతూ భక్తులు అందరూ ఆధ్యాత్మిక చింతనతో సన్మార్గంలో నడువాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తుల శ్రీనివాస్, జెడ్పీటీసీ సంధ్యారాణి ప్రసాద్, తాంసి జెడ్పీటీసీ రాజు, భీంపూర్ జెడ్పీటీసీ కుమ్ర సుధాకర్, నాయకులు సర్పె సోంబాయి, కదం ప్రశాంత్, సబ్లే నానక్ సింగ్, దేవేందర్‌రెడ్డి, అభిరామ్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, ప్రతాప్‌సింగ్, సరిచంద్, గులాబ్ సింగ్ పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను కాలరాస్తోంది

- సీఐటీయూ రాష్ట్ర కోశాధికారి వంగూరి రాములు



మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర కోశాధికారి వంగూరి రాములు

నవతెలంగాణ-నిర్మల్

కేంద్రప్రభుత్వం కార్మిక చట్టాలను కాలరాస్తోందని సీఐటీయూ రాష్ట్ర కోశాధికారి వంగూరి రాములు అన్నారు. శుక్రవారం సీఐటీయూ జిల్లా కార్యాలయంలో సీఐటీయూ జిల్లా కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం కార్మిక చట్టాలను కాలరాస్తూ, నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చిందని అన్నారు. వాటిని వెంటనే రద్దు చేయాలని అన్నారు. ప్రజలకు, రైతులకు నష్టదాయకమైన విద్యుత్ సవరణ బిల్లును తీసుకువచ్చిందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను వ్యూహాత్మక అమ్మకాల పేరుతో విదేశీ ప్రత్యేక పెట్టుబడులు పైప్ లైన్ వంటి చర్యలతో ప్రభుత్వరంగ సంస్థల కేంద్ర ప్రభుత్వం బలహీన పరుస్తుందని అన్నారు. కనీస వేతనాలు పైప్ ఫైనల్ నోటిఫికేషన్ మందుల ధరలపై జీఎస్టీ ఎత్తివేయాలని కార్మికుల కనీస వేతనం రూ.26వేలు అమలు చేయాలని అన్నారు. నిరంతరం సీఐటీయూ కార్మికుల పక్షానా నిలబడి పోరాటం చేస్తుందని అన్నారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్, సీఐటీయూ కోశాధికారి బి.లలిత, జిల్లా కమిటీ సభ్యులు శైలజ, రజియా, వెస్లీ, అతిక్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

- బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి భూక్య జాన్సన్ నాయక్



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ప్రభుత్వం అమలు చేసే పథకాలను ప్రతి ఒక్క పేద కుటుంబం సద్వినియోగం చేసుకోవాలని ఖానాపూర్ ఎమ్మెల్యే అభ్యర్థి భూక్య జాన్సన్ నాయక్ అన్నారు. శుక్రవారం జెడ్పీ చైర్మెన్ రాథోడ్ జనార్ధన్‌తో కలిసి మండలంలోని పిట్టబొంగరం, దస్నాపూర్, మెండాపల్లి, మెండాపల్లిగూడ, చిత్రుగూడ గ్రామాల్లో పర్యటించారు. ఆయా గ్రామాల్లో ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. గ్రామానికి వచ్చిన ఆయనకు బ్యాండ్ మేళాలతో ఘన స్వాగతం పలికారు. పిట్టబొంగరంలో సీనియర్ నాయకుడు సీడాం భీంరావ్‌తో మాట్లాడారు. ఆదివాసుల సమస్యల సాధనకై అందుబాటులో ఉంటానని స్పష్టం చేశారు. అనంతరం దస్నాపూర్ గ్రామంలో పర్యటించగా మహిళలు హారతులతో స్వాగతించారు. పూలాజీ బాబా ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు దేశంలో ఏ రాష్ట్రం అమలు చేయడం లేదన్నారు. గతంలో పనిచేసిన ఎమ్మెల్యే దళితబంధు, కాంట్రాక్టర్లతో పర్సెంటేజీలు తీసుకోని మోసం చేసిందని ఆరోపించారు. పేదల సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తానని ఆయన స్పష్టం చేశారు. అనంతరం ఆయన సమక్షంలో పలువురు బీఆర్ఎస్‌లో చేరాగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆయన వెంట ఎంపీటీసీ గిత్తే ఆశ, మడావి భీంరావ్, ఉపసర్పంచ్ టేహరే గణేష్, జవాడే కేశవ్, సుంకట్ రావ్, కోఆప్షన్ సభ్యులు అంజద్, సోఫియాన్ పాల్గొన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం



నవతెలంగాణ-ఇచ్చోడ

క్రీడల్లో గెలుపోటములు సహజమని ఉట్నూర్ ఐటీడీఏ పీఓ చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. శుక్రవారం ఇచ్చోడ మండల కేంద్రంలోని తెలంగాణ గిరిజన గురుకుల పాఠశాల, కళాశాలలో 7వ జనరల్ గేమ్స్, స్పోర్ట్స్ మీట్‌ను పీఓ, ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి, అధికారులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ముందుగా వివిధ జిల్లాల నుంచి వచ్చిన 765 మంది క్రీడాకారిణుల నుంచి గౌరవ వందనం స్వీకరించి, క్రీడాజ్యోతిని వెలిగించి, క్రీడా పోటీలను ప్రారంభించారు. 18 పాఠశాలల నుంచి వచ్చిన క్రీడాకారులను ఉద్యేశించి పీఓ మాట్లాడుతూ క్రీడాకారులు క్రమశిక్షణతో సాధన చేస్తే గెలుపు ముంగిట ఉంటుందని అన్నారు, రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఆడే అవకాశాలు వస్తాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి, గురుకుల ఓఎస్‌డీ నటరాజ్, కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీ కాంతారావు, రాజేంద్రప్రసాద్, మూర్తి శర్మ, అశ్విని, కృష్ణవేణి పాల్గొన్నారు.

అంతర్‌రాష్ట్ర చెక్‌పోస్టును పరిశీలించిన ఎస్పీ

నవతెలంగాణ-బోథ్

మండలంలోని ఘన్‌పూర్ సరిహద్దు అంతర్‌రాష్ట్ర చెక్ పోస్ట్‌ను ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి శుక్రవారం సందర్శించారు. అలాగే ముందస్తు ఎన్నికల్లో భాగంగా జిల్లాలోని ప్రతి అంతర్‌రాష్ట్ర చెక్ పోస్టులలో పకడ్బందీగా విధులు నిర్వహించాలని సూచించారు. అలాగే అనుమతి లేని వస్తువులు అక్రమంగా తరలిపోకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ భీమేష్, ఎస్సై రాము పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందజేత

నవతెలంగాణ-బెజ్జూర్



మండలంలోని కాటెపెల్లి గ్రామానికి చెందిన మడె శంకర్ నీటి బాతులు పట్టడానికి వెళ్లి ప్రమాదవశాత్తు వాగులో పడి మృతిచెందడంతో ఆయన కుటుంబానికి బెజ్జూర్ ఎస్సై విక్రమ్ శుక్రవారం ఆర్థిక సాయం అందజేశారు. బియ్యం, వంట సామగ్రి, బట్టలను మృతుడి కుటుంబసభ్యులకు అందజేశారు. పేద కుటుంబానికి చెందిన శంకర్ మృతితో కుటుంబం ఇబ్బందులు ఎదుర్కొంటుందని, దీనిని దృష్టిలో ఉంచుకొని తనవంతు ఆర్థిక సాయం అందజేసినట్టు ఎస్సై తెలిపారు.

బ్యాంక్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-రెబ్బెన



బ్యాంక్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ శాస్త్రి అన్నారు. శుక్రవారం మండలంలోని సింగిల్‌గూడ గ్రామంలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంవీరూరల్ ఫోక్ఆర్ట్స్ ఆర్గనైజేషన్ కర్నూల్ కళాజాత బృందం, మ్యాజిక్ షో ద్వారా బ్యాంకుతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ నరేష్, సునీత, కళాజాత బృందం సభ్యులు, మెజీషియన్ ఎస్ తేజ్‌కుమార్, డప్పు ప్లేయర్ వేణు, రైతులు, మహిళలు, గ్రామస్తులు, ఖాతాదారులు పాల్గొన్నారు.

బతుకమ్మ సంబరాలకు మహిళలు సిద్ధం

- నేటి నుండి తొమ్మిది రోజుల పాటు తీరొక్క నైవేద్యాలు
- తెలంగాణకు గుర్తింపు తెచ్చిన పండుగ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

బతుకమ్మ పండుగ తెలంగాణ రాష్ట్రంలో ఆశ్వయుజమాస శుద్ధ పాడ్యమి నుండి తొమ్మిది రోజుల పాటు జరుపుకుంటారు. ఈ బతుకమ్మ(గౌరి) పండగ లేదా సద్దుల పండుగ దసరాకి రెండు రోజుల ముందు వస్తుంది. సెప్టెంబరు, అక్టోబరు నెలలు తెలంగాణ ప్రజలకు పండుగల నెలలు. ఈ నెలలలో రెండు పెద్ద పండుగలు జరుపుకుంటారు. బతుకమ్మ పండుగతో పాటు దసరా పండుగను తెలంగాణకు ప్రత్యేక పండుగలు.

తీరొక్క పూలతో బతుకమ్మలు

రంగు రంగుల పూలతో త్రికోణాకారంలో పేర్చి అలంకరించిన బతుకమ్మల చుట్టూ చప్పట్లు చరుస్తూ వలయంగా తిరుగుతూ బతుకమ్మ పాటలు పాడతారు. బొడ్డెమ్మతో మొదలు ఎంగిలిపువ్వు బతుకమ్మ, సద్దుల బతుకమ్మ ఇలా దేని ప్రత్యేకత దానిదే. తొమ్మిది రోజుల పాటు కొనసాగే బతుకమ్మలను బావిలో లేదా నీటి ప్రవాహంలో నిమజ్జనం చేస్తారు. బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో అని సాగే ఈ పాటల్లో మహిళలు తమ కష్ట సుఖాలు, ప్రేమ, స్నేహం, బంధుత్వం, ఆప్యాయతలు, భక్తి, భయం, చరిత్ర, పురాణాలు మేళవిస్తారు. ఈ పాటలు చాలా వినసొంపుగా ఉంటాయి. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక ఈ బతుకమ్మ పండుగ. తెలంగాణ అస్థిత్వం బతుకమ్మలోనే ఉంది. తెలంగాణ నేలపై బతుకమ్మ పండుగను శతాబ్దాలుగా జరుపుకుంటున్నారు. ఈ సాంప్రదాయం ఎలా మొదలైందో చెప్పడానికి ఎన్నో కథలు ప్రచారంలో ఉన్నాయి. నవాబులు, భూస్వాముల పెత్తందారీతనంలో నలిగిపోయిన తెలంగాణ గ్రామీణ సమాజంలో మహిళల బతుకులు దుర్భరంగా ఉండేవి. వారి ఆకృత్యాలకు నలిగిపోయిన వారిని, తట్టుకోలేక ఆత్మహత్యలు చేసుకున్నవారిని తలచుకొని తోటి మహిళలు విచారించేవారు. వారికి ప్రతీకగా పూలను పేర్చి బతుకవమ్మా లేదా బతుకు అమ్మా అంటూ దీవిస్తూ పాటలు పాడేవారు. బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో..పాటల వెనుక ఉండే మర్మం ఇదే.



అధికారిక బతుకమ్మ వేడుకల్లో కలెక్టర్, జెడ్పీ చైర్‌పర్సన్(ఫైల్)

తొమ్మిది రోజుల బతుకమ్మ నైవేద్యాలు

9రోజులపాటు ప్రతిరోజూ ఓ రకమైన నైవేద్యం సమర్పిస్తారు. మొదటి ఎనిమిది రోజులు ఈ నైవేద్యం తయారీలో యువకులు, యువతులు పాల్గొంటారు. చివరిరోజు సద్దుల బతుకమ్మ అంటారు. ఈరోజు మాత్రం నైవేద్యాన్ని మహిళలు తయారు చేస్తారు.

ఎంగిలి పూల బతుకమ్మ

మహా అమవాస్యరోజు బతుకమ్మ మొదటిరోజు వేడుక మొదలవుతుంది. తెలంగాణలో దీన్ని పెత్రామస అని కూడా అంటారు. నువ్వులు, బియ్యొ ండి, నూకలు కలిపి నైవేద్యం తయారు చేస్తారు. అటుకుల బతుకమ్మ..ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి నాడు చేస్తారు. సప్పిడి పప్పు, బెల్లం, అటుకులతో నైవేద్యం తయారు చేసి అమ్మవారికి సమర్పిస్తారు. ముద్దపప్పు బతుకమ్మ ..ముద్దపప్పు, పాలు, బెల్లంతో నైవేద్యం తయారు చేసి సమర్పిస్తారు. నాన బియ్యం బతుకమ్మ.. నానేసిన బియ్యం, పాలు, బెల్లం కలిపి నైవేద్యం చేస్తారు. అట్ల బతుకమ్మ..అట్లు లేదా దోశ నైవేద్యంగా సమర్పిస్తారు. అలిగిన బతుకమ్మ..ఈరోజు ఆశ్వయుజ పంచమి. నైవేద్యమేమి సమర్పించరు.

వేపకాయల బతుకమ్మ..బియ్యం పిండిని బాగా వేయించి వేపపండ్లుగా తయారు చేసి నైవేద్యంగా సమర్పిస్తారు. వెన్నముద్దల బతుకమ్మ..నువ్వులు, వెన్న లేదా నెయ్యి బెల్లం కలిపి నైవేద్యం తయారు చేస్తారు. సద్దుల బతుకమ్మ..ఆశ్వయుజ అష్టమి నాడు ఆదేరోజు దుర్గాష్టమిని జరుపుకుంటారు. ఐదురకాల నైవేద్యాలు తయారు చేస్తారు. పెరుగన్నం, చింతపండు పులిహెూర, లెమన్ రైస్, కొబ్బరన్నం, నువ్వులన్నం.తొమ్మిది రోజులు సమర్పించే నైవేద్యాలలో మొక్కజొన్నలు, జొన్నలు, సజ్జలు, మినుములు, శనగలు, పెసర్లు, పల్లీలు, నువ్వులు, గోధుమలు, బియ్యం, కాజు, బెల్లం, పాలు ఉపయోగిస్తారు.

సద్దుల బతుకమ్మ ప్రత్యేకమైనది

చివరి రోజు బతుకమ్మ(సద్దుల బతుకమ్మ) పండుగ అత్యంత మనోహరంగా ఉంటుంది. ఆ రోజు మగవారంతా పచ్చిక బయళ్లలోనికి పోయి తంగేడు, గునుగు మొదలగు పూలను భారీగా ఏరుకుని వస్తారు. ఆ తరువాత ఇంటిళ్లపాదీ కూర్చుని ఆ పూలతో బతుకమ్మను తయారు చేస్తారు. ఇందులో గునుగు పూలు మరియు తంగెడు పూలు ముఖ్య భూమికను పోషిస్తాయి. ఈ పూలను జాగ్రత్తగా ఒక రాగి పళ్ళెం (తాంబలం)లో వలయాకారంగా, రంగులు మార్చుకుంటూ పేరుస్తారు. ముందుగా తంగెడు ఆకులు, పూలు పళ్లెంలో లేదా తాంబోలంలో పేర్చుతారు. ఆపై తంగేడు పూలతో కట్టలుగా కట్టిన కట్టలను పేర్చుతారు. మధ్య మధ్యలో ఇతర రకాల పూలను ఉపయోగిస్తారు. ఈ అమరిక ఎంత పెద్దదిగా ఉంటే అంత అందంగా ఉంటుంది. తెల్లని గునుక పూలను రంగులతో అద్ది పెడతారు. పేర్చడం అయ్యాక పైన పసుపుతో చేసిన గౌరి మాతను పెడతారు. ఇలా పేర్చిన బతుకమ్మను గృహంలోని దైవస్థానంలో అమర్చి కొవ్వొత్తులతో, అగరొత్తులతో అలంకరించి పూజిస్తారు. సాయంకాలం అందరూ తమ తమ బతకమ్మలతో ఒక చోట చేరి వాటిని మధ్యలో పెట్టి వాటి చుట్టూ తిరుగుతూ పాటలతో గౌరి దేవిని కీర్తిస్తూ ఆడవారు పాడుతారు. ఆడవారు వారికి ఉన్న అన్ని రకాల ఆభరణాలను దరించి కొత్త బట్టలు కట్టుకుంటారు. ఇలా చాలా సేపు ఆడాక మగవారు వాటినిచెరువులో నిమజ్జనం చేస్తారు. ఆపై ఆ పళ్లెంలో తెచ్చిన నీటితో ఆడవారు వాయినమమ్మా వాయినం అంటూ వాయినాలు ఇచ్చి పుచ్చుకుంటారు. ఆపై ఇంటి నుండి తీసుకువచ్చిన పెరుగన్నం మరియు సత్తుపిండి (మొక్కజొన్నలు, లేదా వేరుశనగ లేదా పెసర విత్తనాలను దోరగ వేయించి వాటిని పిండి చేసి వాటితో చక్కెర పిండి లేదా బెల్లం మరియు నెయ్యి తగినంత కలిపి తయారు చేస్తారు) లను ఇచ్చి పుచ్చుకొని తింటారు.

సామాజిక మాధ్యమాల్లో వీడియోపై ఎస్పీ వివరణ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారిన సిర్పూర్ ఎమ్మెల్యే కోనప్పను జిల్లా ఎస్పీ సురేష్ కుమార్ సన్మానం చేస్తున్నట్లు వచ్చిన వీడియోపై ఎస్పీ సురేష్ కుమార్ వివరణతో కూడిన పత్రిక ప్రకటన విడుదల చేశారు. 20 నెలల క్రితం ఎమ్మెల్యే ను సన్మానించిన వీడియోను కొంతమంది కావాలని వైరల్‌గా మార్చారని పేర్కొన్నారు. ఎన్నికల నియమావళి అమలు చేయడంలో తనతో పాటు కింది సిబ్బందిని కూడా బేధాలు లేకుండా చూడాలని ఆదేశించినట్లు పేర్కొన్నారు. శాంతియుత వాతావరణంలో రాగద్వేషాలు లేకుండా ఎన్నికలు నిర్వహించడానికి పోలీస్ సిబ్బంది అహర్నిశలు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. తమ పనిని గుర్తించి గతంలో ఎన్నో రకాల అవార్డులు వచ్చాయని తెలిపారు. గతంలో వివిధ సందర్భాల్లో నాయకులను, అధికారులను సన్మానించిన పత్రిక ప్రకటనలను, ఫోటోలను మీడియాకు విడుదల చేశారు.

ఉచిత గర్భాశయ వ్యాధి నివారణ చికిత్స శిబిరం



నవతెలంగాణ-కెరమెరి

పశువులలో ఉచిత గర్భాశయ వ్యాధి నివారణ చికిత్స శిబిరాన్ని పశు వైద్య శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని ఝరి గ్రామంలో ఏర్పాటు చేశారు.. సుమారు 75 పశువులను పరీక్షించి వివిధ వ్యాధులకు చికిత్స అందించి మందులు పంపిణీ చేశారు. పశువుల్లో వచ్చే వ్యాధులపై యజమానులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి పశువైద్య అధికారి డాక్టర్ మురళి కృష్ణ, పశువైద్య సిబ్బంది సోనియా, సురేష్, సత్తయ్య, రాజ్ కుమార్, గోపలమిత్ర సూపర్ వైజర్ రమేష్ పాల్గొన్నారు.

జాతీయ ప్రతిభ ఉపకార వేతనాలకు ఆదర్శ విద్యార్థుల ఎంపిక

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ కళాశాలకు చెందిన 27 మంది విద్యార్థులు కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ అందించే కేంద్ర ప్రభుత్వ ప్రతిభా ఉపకార వేతనాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ తెలిపారు. ఈ సంవత్సరం ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులలో 936 మార్కులకు పైగా సాధించిన 27 మంది మెరిట్ ఆధారంగా ఇంటర్ బోర్డు విడుదల చేసిన ప్రాథమిక జాబితాలో ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన వారిలో ఎంపీసీ గ్రూప్ నుండి ఎ.యశశ్రీ(976), ఎం.ప్రణతి, ఆర్.అనూష, పి.ఇందు, ముద్దం రమ, దాసరి సుష్మిత, బురుగు ప్రియాంక, జాగిరి పూజిత, బైపీసి గ్రూప్ నుండి కే.సుప్రియ (975), పొట్టే పావని, జే.కృష్ణవేణి, ఎం.మైథిలి, కే.అంజలి, ప్రసన్న లక్ష్మి, బి.వర్ష, చౌహాన్ అంకిత, ఎస్.వంశీ, జి.హారిక, ముస్కాన్ బేగం, హుమేరా ఆఫ్రీన్, ఎస్. శ్రీషా, ఎంపీసీ గ్రూప్ నుండి సామేర శిరీష (974), వేముల మానస, ఎ.ఆదర్శ్, ఎస్.సమత, సీఈసీ గ్రూప్ నుండి ఈ.నవిత (966), ఎస్.గౌతం ఉన్నారన్నారు. ఎంపికైన విద్యార్థులు డిగ్రీలో సంవత్సరానికి రూ.10వేల చొప్పున, పోస్ట్ గ్రాడ్యుయేషన్‌లో సంవత్సరానికి రూ. 20,000 చొప్పున మొత్తం రూ.70,000 ఉపకారవేతనం పొందడానికి అర్హత సాధించారన్నారు.

ఘనంగా బతుకమ్మ సంబరాలు



నవతెలంగాణ-సిర్పూర్(టి)

బతుకమ్మ పండుగ ఉత్సవాలను పురస్కరించుకొని మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏబీవీపీ సంఘం ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. విద్యార్థులు బతుకమ్మలను పేర్చి ఆటపాటలతో సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులు సాంప్రదాయ పండుగల గురించి తెలుసుకుంటూ వాటిని ముందుకు తీసుకెళ్లాలని సిర్పూర్ భజరంగ్‌దల్ అధ్యక్షుడు దుర్గం ప్రశాంత్ కోరారు. వేడుకల్లో కళాశాల ప్రిన్సిపల్ కళ్యాణి, అధ్యాపకులు ఆభియా ఖానం, ఏబీవీపీ రాష్ట్ర సభ్యులు నవీన్, బీజేవైఎం అధ్యక్షుడు బనార్కర్ సాయి, నాంపెల్లి సాయికుమార్, వంశీ, రాపర్తి శ్రీకాంత్, రోహిత్, విద్యార్థినీలు పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలొద్దని గ్రామ దేవతలకు పూజలు


నవతెలంగాణ-దహెగాం

వ్యాధులు ప్రబలొద్దని కోరుతూ మండలంలోని కొత్మీర్ గ్రామంలో గ్రామ దేవతలకు శుక్రవారం పూజలు నిర్వహించారు. ఇటీవల గ్రామంలో విష జ్వరాలు ప్రబలి గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు చనిపోయారు. గ్రామంలో వ్యాధులు రావొద్దని కోరుతూ గ్రామంలోని మహిళలు బిందెలతో సమీప పెద్దవాగులోని గంగాజలాన్ని తీసుకొచ్చి గ్రామ దేవతలకు అభిషేకం చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామ దేవతలను ఐదు రోజుల పాటు గంగాజలంతో అభిషేకం నిర్వహించి పూజలు నిర్వహిస్తే గ్రామం ఆయురారోగ్యాలతో వర్ధిల్లుతుందని తమ నమ్మకమని పేర్కొన్నారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికుల వేతనాలు పెంచాలి

- జీఓ నెంబర్ 22ను గెజిట్ చేసి అమలు చేయాలి

నవతెలంగాణ-రెబ్బెన



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓదెలు

రాష్ట్ర ప్రభుత్వం 2021లో జారీ చేసిన ఐదు కనీస వేతనాల జీఓలను ఆరు వారాల గడువులోగా గెజిట్ చేసి వేతనాలు చెల్లించాలని, రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయాలని సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సంఘం(సీఐటీయూ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ ఓదెలు డిమాండ్ చేశారు. శుక్రవారం ఖైరిగూడ ఓపెన్‌కాస్టు వద్ద జరిగిన బ్లాస్టింగ్ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత 10 సంవత్సరాల నుండి కాంట్రాక్టు కార్మికుల వేతనాలు పెరగలేదని, కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం వేతనాలు పెంచడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కనీస వేతనాల జీఓలను సవరించకుండా కాంట్రాక్టు కార్మికులకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. కాంట్రాక్టు కార్మికులకు చాలీచాలని వేతనాలు చెల్లిస్తూ శ్రమదోపిడికి గురిచేస్తున్నారన్నారు. 2022 సెప్టెంబర్‌లో జీతాల పెరుగుదల, ఇతర సమస్యల పరిష్కారం కోసం 18 రోజులు సమ్మె జరిగిందని గుర్తు చేశారు. సంవత్సరం అవుతున్న సమ్మె ఒప్పందాలు అమలు చేయడం లేదన్నారు. 2006లో కనీస వేతనాల సర్క్యూలర్‌ను విడుదల చేసిన ప్రభుత్వం ఐదేండ్లకు ఒకసారి కనీస వేతనాల సర్క్యూలర్‌ను విడుదల చేయాలనే నిబంధనను తుంగలో తొక్కి చట్టాన్నీ ఉల్లంఘించి కార్పొరేటర్ల కొమ్ము కాస్తున్నాయన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఇప్పటివరకు ఒక్క వేతనం కూడా గెజిట్ చేయలేదన్నారు. పోరాటలతో పాటు న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో ఆరు వారాల్లో జీఓ అమలు చేయాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసిందన్నారు. కోర్టు ధిక్కరణ నేరానికి పాల్పడకుండా తీర్పును గౌరవించి సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. మరోసారి సమ్మె చేసే పరిస్థితి కల్పించొద్దని హెచ్చరించారు. ఈ సమావేశంలో బ్లాస్టింగ్ కార్మికులు పర్వతాలు, చారి, రవి, వెంకటేశ్, ఇస్తారు, కొమురన్న పాల్గొన్నారు.

కోల్ ట్రాన్స్‌పోర్టు డ్రైవర్లకు రూ.32 వేల వేతనం ఇవ్వాలి

- ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగె ఉపేందర్
- విధులు బహిష్కరించిన డ్రైవర్లు, క్లీనర్లు



విధులు బహిష్కరించి నిరసన వ్యక్తం చేస్తున్న డ్రైవర్లు, క్లీనర్లు

నవతెలంగాణ-రెబ్బెన

సింగరేణి సంస్థలో అనేక సంవత్సరాల నుండి చాలీచాలని వేతనాలు తీసుకుంటూ సింగరేణి సంస్థ అభివృద్ధికి అత్యంత కీలకపాత్ర పోషిస్తున్న కోల్ ట్రాన్స్‌పోర్టు లారీ డ్రైవర్లకు కనీస వేతనం రూ.32 వేలు ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగె ఉపేందర్ డిమాండ్ చేశారు. డ్రైవర్లకు 32 వేలు, క్లీనర్లకు రూ.18 వేలు చెల్లించాలని శుక్రవారం డ్రైవర్లు, క్లీనర్లు విధులను బహిష్కరించారు. ప్రతి డ్రైవర్‌కు, క్లీనర్‌కు సీఎంపీఎఫ్, కార్పొరేట్ వైద్య సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. శుక్రవారం నుండే వేతనాలు పెంచాలని కోరుతూ గోలేటిలో డ్రైవర్లు, క్లీనర్లు సీహెచ్‌పీ సమీపంలో ఉన్న గోల్డెన్ సిటీలో విధులు బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. వారికి ఏఐటీయూసీ నాయకులు మద్దతు తెలిపి మాట్లాడారు. డ్రైవర్లు, క్లీనర్లను శ్రమదోపిడికి గురిచేస్తున్నారని, కనీస వేతనం రూ.32 వేలు ఇవ్వాలని, 24 గంటలు పనిచేస్తూ, చాలీచాలని వేతనాలు తీసుకుంటూ కుటుంబాలను పోషించుకోలేక ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. ఎనిమిది గంటల పని దినం అమలు చేయాలని, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించడంతో పాటు బోనస్ చెల్లించాలన్నారు. ప్రతినెల 10వ తేదీలోపు వేతనాలు అందించాలన్నారు. ప్రమాదవశాత్తు డ్రైవర్లు, క్లీనర్లు చనిపోతే దహన సంస్కరణలకు రూ.లక్ష, ఎక్స్‌గ్రేషియా రూ.10 లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డ్రైవర్లు, క్లీనర్ల సంఘం అధ్యక్షుడు అరికిల్ల స్వామి, నాయకులు తిరుపతి, గౌస్, అజ్గర్, సాగర్, కుమార్, మహేష్, రవి, ప్రసాద్, లచ్చన్న, రవీందర్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళనలు తీవ్రం



మున్సిపల్ కార్మికుల సమ్మెకు మద్దతు ఇస్తున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు

నవతెలంగాణ-కాగజ్‌నగర్‌రూరల్

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన తీవ్రతరం చేస్తామని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు జాదవ్ రాజేందర్ అన్నారు. పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ పారిశుద్య కార్మికులు చేపడుతున్న సమ్మె శుక్రవారం 5వ రోజుకు చేరుకుంది. సమ్మె శిబిరాన్ని సందర్శించిన అనంతరం రాజేందర్ మాట్లాడుతూ ప్రతీ 4, 5 నెలలకు ఒకసారి కార్మికులు ఆందోళన చేస్తే తప్పా అధికారులు వేతనాలు చెల్లించడం లేదన్నారు. ప్రస్తుతం పండుగలు వస్తున్నాయని, ఈ సమయంలో 4 నెలల వేతనాలు పెండింగ్‌లో ఉంటే వారి కుటుంబాలు పండుగలు ఎలా జరుపుకుంటాయని ప్రశ్నించారు. పెండింగ్‌లో ఉన్న 4 నెలల వేతనాలను చెల్లించడంతో పాటు ఈఎస్ఐ, పీఎఫ్ వారివారి ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో సమ్మెను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు శంకర్, ప్రధాన కార్యదర్శి సంజీవ్, కార్మికులు పాల్గొన్నారు.

కోలిండియా స్థాయిలో రాణించాలి

- బెల్లంపల్లి ఏరియా జీఎం డి రవిప్రసాద్

నవతెలంగాణ-రెబ్బెన



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న జీఎం రవిప్రసాద్

బెల్లంపల్లి ఏరియాలోని గోలేటిలో శ్రీభీమన్న క్రీడా మైదానంలో శుక్రవారం(డబ్ల్యూపీఎస్అండ్‌జీఏ) 90వ వార్షిక క్రీడా పోటీల్లో భాగంగా నియర్‌బై హాకీ పోటీలను బెల్లంపల్లి ఏరియా జీఎం డి రవిప్రసాద్ ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకొని వారితో కలిసి హాకీ ఆడి పోటీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి ఉద్యోగ క్రీడాకారులు కోలిండియా స్థాయిలో రాణించి మంచి పేరు తీసుకురావాలన్నారు. ప్రాంతాలు కాకుండా ఉద్యోగులంతా ఒకే కుటుంబంగా క్రీడాస్ఫూర్తిని చాటాలన్నారు. అనంతరం మందమర్రి, బెల్లంపల్లి ఏరియా జట్ల మధ్య జరిగిన హాకీ పోటీలో 2-1 గోల్స్ తేడాతో బెల్లంపల్లి జట్టు విజయం సాధించింది. ఈ కార్యక్రమంలో డీజీఎం(ఐఈడీ) ఉజ్వల్ కుమార్ బెహరా, డీవైపీఎం రెడ్డిమల్ల తిరుపతి, సీనియర్ పీఓ ప్రశాంత్, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ మురహరిరావు, జనరల్ కెప్టెన్ చంద్రకుమార్, మందమర్రి జనరల్ కెప్టెన్ చిన్నన్న, క్రీడాకారులు పాల్గొన్నారు.

లక్ష్మీపూర్, పాటగూడ గ్రామాల్లో వైద్యశిబిరం

నవతెలంగాణ - వాంకిడి

మండలంలోని లక్ష్మీపూర్, పాటగూడ గ్రామాల్లో శుక్రవారం హెచ్ఈఓ రవిదాస్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించి గ్రామస్తులకు సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. జ్వరంతో బాధపడుతున్న తొమ్మిది మంది రక్త నమూనాలు సేకరించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్ఏ భగవాన్‌దాస్, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షుడికి మాతృ వియోగం

నవతెలంగాణ - బెజ్జూర్

రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షుడు కోండ్ర జగ్గాగౌడ్ తల్లి కోండ్ర బుచ్చమ్మ(87) గురువారం రాత్రి మృతి చెందింది. వారం రోజుల నుండి అనారోగ్యంతో బాధపడుతున్న ఆమెకు ఉన్నత వైద్యం చేయించినప్పటికీ నయంకాకపోవడంతో అస్వస్థత నుండి కోలుకోకుండా మృతి చెందింది. దీంతో కోండ్ర జగ్గాగౌడ్ కుటుంబంలో విషాధఛాయలు అలుముకున్నాయి. ఆయన కుటుంబాన్ని శుక్రవారం ఉదయం ఎమ్మెల్యే కోనేరు కోనప్ప పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
4
శనివారం | అక్టోబర్ 14, 2023 | www.navatelangana.com

సోలార్ పవర్ ప్లాంట్‌ని సందర్శించిన ఏరియా జీఎం

నవతెలంగాణ-మందమర్రి



మందమరి ఏరియా జనరల్ మేనేజర్ మనోహర్ ఏరియాలోని 28మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్‌ను శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా జీఎం పవర్ ప్లాంట్ పనితీరును, విధి విధానాలను, యంత్రాల వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. సోలార్ ప్లాంట్ పనితీరు బాగుందని సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం ఈఅండ్ఎం జె.నాగరాజు, ఎస్ఈఈఅండ్ఎం ఎం.నాగరాజు నాయక్, ఏరియా వర్క్‌షాప్ ఇన్‌చార్జీలు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై కళాజాతా

నవతెలంగాణ-తాండూర్



మండలంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ రేచిని బ్రాంచ్ ఆధ్వర్యంలో రేచిని గ్రామంలో ఆర్థిక అక్షరాస్యత కళాజాత కార్యక్రమం నిర్వహించారు. బ్యాంకు పథకాలపై, వివిధ రుణాలు, రుణమాఫీపై ముఖ్యంగా సామాజిక భద్రత పథకాలపై అవగాహన కల్పించారు. సైబర్ మోసాలపై జాగ్రత్త వహించాలని ప్రజలకు అర్థమయ్యే విధంగా ఆట పాటలు, మ్యాజిక్ షో ద్వారా కళాజాత బృందం సభ్యులు వివరించారు. కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ జి రాజేంద్ర, కళాజాత బృందం సభ్యులు మెజీషియన్ ఎం తేజ్‌కుమార్, వేణు, బ్యాంకు ఖాతాదారులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

నవతెలంగాణ-తాండూర్

తాండూర్ ఐబీ కొత్త గుడిసెల సమీపంలో రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. రైల్వే పోలీసులు, హెడ్‌కానిస్టేబుల్ లక్ష్మణ్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. తంగలపల్లి నుంచి తాండూర్‌లోని గవర్నమెంట్ ఆస్పత్రికి గొర్లపల్లి పకీర్(85) రైల్వే పట్టాలు దాటుతున్నాడు. అదే సమయంలో రైలు వచ్చి ఢీ కొట్టింది. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జీపీ కార్యాలయ నిర్మాణ పనులు పరిశీలన



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని సింగరాయపేట పంచాయతీ కార్యాలయ నిర్మాణ పనులను శుక్రవారం మండల పంచాయతీ అధికారి రమేష్ పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలో చేపట్టిన పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. అనంతరం పంచాయతీ కార్యాలయ నిర్మాణ పనులను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆ గ్రామ సర్పంచి జైనేని నడిపి భీమయ్య కార్యదర్శి పాల్గొన్నారు.

బాపు అప్లికేషన్స్ ద్వారా స్థానిక యువతకు ఉపాధి



నవతెలంగాణ-తాండూర్

గేయ రచయితగా, సినీ నిర్మాతగా సుపరిచితులైన మాదారం గ్రామానికి చెందిన తైదల బాపు బాపు అప్లికేషన్స్ సంస్థను ప్రారంభించి నిరుద్యోగ యువతకు ఉపాధి అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. నేటి యువత కోరుకొనే స్మార్ట్ వాచ్‌ని తయారు చేసి అందుబాటు ధరలో అందిస్తూ వినియోగదారుల సంక్షేమంతో పాటు వీటి విక్రయాన్ని షాపుల ద్వారా కాకుండా నిరుద్యోగ యువత ద్వారా జరిపి వారికి ఉపాధి అందించనున్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో తైదల బాపు సంస్థ బ్రోచర్‌ని ఆవిష్కరించి భవిష్యత్ కార్యాచరణను వివరిస్తూ యువత ఉపాధియే లక్ష్యంగా సంస్థను ప్రారంభించామన్నారు. భవిష్యత్తులో మరిన్ని ఉత్పత్తులు తీసుకు రానున్నామని, పుట్టి పెరిగిన వ్యక్తిగా ఈ ప్రాంతంపై అభిమానంతోనే తాను నిర్మించిన మొదటి చిత్రాన్ని ఎక్కువ భాగం ఈ పరిసర ప్రాంతాలలో చిత్రీకరించానని పేర్కొన్నారు. అదే అభిమానంతో ఈ ప్రాంతంలోని యువతకు అధిక ప్రాధాన్యత ఇచ్చే ఉద్దేశంతో ప్రోడక్ట్‌ని ఇక్కడే లాంచ్ చేసి అవకాశాన్ని మొదటిగా ఇక్కడి వారికి అందిస్తున్నానని తెలిపారు. సినీ నిర్మాత, దర్శకులు విజయ్ వర్మ పాకలపాటి మాట్లాడుతూ తైదల బాపు నిర్మించిన చిత్రంలో ఇక్కడి లోకేషన్స్ చాలా అందంగా వచ్చాయని, వాటిని చూసేందుకే తాను ఇక్కడికి వచ్చానని అన్నారు. ఈ కార్యక్రమంలో తైదల శ్రీనివాస్, సంస్థ బిజినెస్ హెడ్ వినయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఏఆర్ఎస్ కళాశాలలో ముందస్తు బతుకమ్మ సంబరాలు



జన్నారం

నవతెలంగాణ-జన్నారం

మండల కేంద్రంలోని ఏఆర్ఎస్ కళాశాలలో విద్యార్థులు శుక్రవారం ముందస్తు బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ ముత్యం సతీష్ ఆధ్వర్యంలో తంగేడు, గులాబీ, మందారం పూలతో పెద్ద బతుకమ్మను పేర్చి విద్యార్థులతో ఆడి పాడారు. తెలంగాణ సంస్కృతి ఉట్టిపడే విధంగా విద్యార్థులు రంగుల చీరలు ధరించి బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్నారు.

మందమర్రి : శ్రీ సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో ముందస్తు బతుకమ్మ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. తీరొక్క పువ్వులతో బతుకమ్మను పేర్చి బతుకమ్మలను పాఠశాలకు విద్యార్థులు తీసుకువచ్చారు. పసుపుతో గౌరమ్మను చేసి బతుకమ్మ పాటలతో ఆడిపాడారు. చిన్నారులు సైతం ఆనందంగా బతుకమ్మ ఆట ఆడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కార్యదర్శి రాములు, అధ్యక్షులు బండారు సూరిబాబు, ప్రధాన ఆచార్యులు కట్ట శిరీష, ఆచార్యులు, విద్యార్థినీలు, తల్లితండ్రులు పాల్గొన్నారు.



మందమర్రి

అట్టహాసంగా జోనల్ క్రీడలు ప్రారంభం

- క్రీడలను ప్రారంభించిన కలెక్టర్ బదావత్ సంతోష్

నవ తెలంగాణ-తాండూర్



క్రీడా జ్యోతితో కలెక్టర్ బదావత్ సంతోష్, ఇతర అధికారులు

బెల్లంపల్లి(సిఓఈ)లో 9వ జోనల్ స్థాయి క్రీడా పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. నాలుగు రోజులపాటు జరిగే ఈ క్రీడలను కలెక్టర్ బదావత్ సంతోష్ ప్రారంభించారు. అనంతరం సిఓఈ ప్రిన్సిపల్ ఐనాల సైదులు అధ్యక్షతన జరిగిన ప్రారంభ సభలో కలెక్టర్ మాట్లాడుతూ క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని తెలిపారు. ఓడిపోయిన విద్యార్థులు గెలుపు కోసం కృషి చేయాలన్నారు. క్రీడల వల్ల శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందని తెలిపారు. విద్యార్థులు క్రీడా స్ఫూర్తితోయ ఆటల్లో పాల్గొనాలని సూచించారు. సంక్షేమ గురుకులాల సంస్థ విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాలను వెలికితీయడానికి వలు స్థాయిల్లో క్రీడలు నిర్వహించడం అభినందనీయమన్నారు. గురుకులాల్లో క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వడం వల్ల విద్యార్థిని నందిని ఏషియన్ గేమ్స్‌లో పథకం సాధించిందన్నారు. అడిషనల్ కలెక్టర్ బి.రాహుల్ మాట్లాడుతూ క్రీడలు ఆత్మస్థైర్యాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. విద్యతోపాటు క్రీడలు, సాంస్కృతిక సమాన స్థాయి కార్యక్రమాలతో ముందుకెళ్తున్న సిఓఈ బోధన, బోధనేతర సిబ్బంది కృషిని కొనియాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ బి.సుధాకర్, మున్సిపల్ కమిషనర్ కె.సమ్మయ్య, ఎంఈఓ పి.మహేశ్వర్‌రెడ్డి, లయన్స్ క్లబ్ అధ్యక్షులు తిరుపతిరెడ్డి, జోనల్ గేమ్ ఓవరాల్ ఇన్‌చార్జి దాసరి ప్రసాద్, సీనియర్ పీడీలు రవి, శ్రీధర్, అల్లూరి వామన్, ఆదిలాబాద్ జిల్లా డిసిఓ శ్రీనివాస్, ప్రిన్సిపాల్స్ లలితకుమారి, పి.జ్యోతి, సంధ్యారాణి, ఊటూరి సంతోష్, ఊటూరి శ్రీనాథ్, సౌద వినోద్, స్వరూప, వైస్ ప్రిన్సిపాల్ కోట రాజ్‌కుమార్, జెవిపి కొక్కుల రాజేష్, నాలుగు జిల్లాల వ్యాయామ ఉపాధ్యాయులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

15న సంస్మరణ సభలను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న నాయకులు

నవతెలంగాణ-మంచిర్యాల

గద్దర్, జహీర్ అలీఖాన్ సంస్మరణ సభను విజయవంతం చేయాలని భారత్ బచావో నాయకులు కోరారు. శుక్రవారం నస్పూర్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 15న శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో సంస్మరణ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. గద్దర్ దేశంలోనే కాక ప్రపంచంలోనే బడుగు బలహీన వర్గాల గొంతుకై తన పాట ద్వారా వారి బాధలను పాలకులకు తెలియజేశారన్నారు. సింగరేణి కార్మికుల గొంతుకై నిలిచి వారి హక్కులను సాధించుకోవడంలో ముఖ్య భూమికను పోషించారన్నారు. గద్దర్ మరణించిన తర్వాత అంతిమ యాత్రలో పాల్గొన్న ఆయన ఆప్తమిత్రుడైన జహీర్ అలీ ఖాన్ గుండెపోటుతో మరణించడం జరిగిందని, ఈయన కూడా సమాజ సేవకుడని, భారత్ బచావో చైర్పర్సన్‌గా ఎన్నో కార్యక్రమాలను నిర్వహించారని తెలిపారు. గద్దర్‌తో పాటు జహీర్ అలీ ఖాన్ సంస్మరణ సభను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సభకు ప్రముఖులు హాజరవుతరని, ప్రజలందరూ హాజరై వీరికి నివాళు లర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సామాజిక న్యాయవేదిక జిల్లా కన్వీనర్ రంగు రాజేశం, బీసీ ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ వడ్డేపల్లి మనోహర్, భారత్ బచావో మంచిర్యాల జిల్లా చైర్మెన్ కనుకుంట్ల మల్లయ్య, రాష్ట్ర నాయకులు సమ్ము రాజయ్య, జిల్లా నాయకులు ప్రభాకర్ పాల్గొన్నారు.

గుండా మల్లేష్‌కు సీపీఐ నాయకుల నివాళి

నవతెలంగాణ-మంచిర్యాల



మంచిర్యాల

సీపీఐ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే గుండా మల్లేష్ మూడవ వర్ధంతి సందర్భంగా శుక్రవారం నివాళులర్పించారు. పార్టీ మండల కార్యదర్శి జోగుల మల్లయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు దాసు హాజరై మాట్లాడుతూ నల్ల నేలపై విప్లవ రాగాలు పలికించిన నేత గుండా మల్లేష్ అని తెలిపారు. సీపీఐ అనుబంధ సంఘాలైన విద్యార్థి, యువజన సంఘాల ఉద్యమాలలో, సింగరేణి కార్మిక ఉద్యమాలలో కీలకమైన పాత్ర పోషించారని పేర్కొన్నారు. ఆసిఫాబాద్ నియోజకవర్గం నుండి పార్టీ అభ్యర్థిగా మూడు దఫాలు, బెల్లంపల్లి నియోజకవర్గం నుండి ఒక దఫా ఎమ్మెల్యేగా గెలిచారని, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో రైతాంగ పోరాటాలలో కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. జైలు జీవితం కూడా గడిపారని గుర్తు చేశారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారన్నారు. సీపీఐ శాసనసభ పక్ష నాయకులుగా పేద బడుగు బలహీన వర్గాలకు గొంతుకను అసెంబ్లీలో వినిపించారని తెలిపారు. ప్రస్తుతం మన మధ్యలో లేకపోవడం బాధాకరమైన విషయమని, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు తీరని లోటని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు అఫ్రోజ్‌ఖాన్, మొగిలి లక్ష్మణ్, కనుకుంట్ల సన్నీగౌడ్, దొడ్డిపట్ల రవీందర్, నాయకులు ఆళ్ల లచ్చిరెడ్డి, అచ్చ హరీష్, ముత్తునూరి మహేష్, ముత్తునూరి అజయ్, విశాల్, గరిగ విజయ్, దాడి దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.



తాండూర్

తాండూర్ : ఐబీలోని భగత్ సింగ్ భవన్‌లో సీపీఐ మాజీ శాసనసభ పక్ష నేత దివంగత గుండా మల్లేష్ మూడవ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఐ మండల కార్యదర్శి సాలిగామ సంతోష్, జిల్లా కార్యవర్గ సభ్యుడు మామిడాల రాజేశం ఆయన పోరాటలు, ఎమ్మెల్యేగా చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి సాలిగామ సంతోష్, సీనియర్ నాయకులు కామెర మల్లయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు సుబ్బ దత్తుమూర్తి కృష్ణ, నాగరాజు, మలిశెట్టి సత్యనారాయణ, ఎడ్ల గోపాల్, గుండేటి రామచందర్ పాల్గొన్నారు.

డెంగ్యూతో బాలింత మృతి

నవతెలంగాణ-జైపూర్



రుచిత (ఫైల్)

మండలంలోని రామారావుపేట్ గ్రామ పంచాయతీ దుబ్బపల్లికి చెందిన కామెర రుచిత (21) డెంగ్యూ జ్వరంతో గురువారం అర్ధ రాత్రి మృతి చెందింది. 12రోజుల క్రితం కాన్పులో బాలునికి జన్మనిచ్చిన రుచితకు జ్వరం రావడంతో కుటుంబ సభ్యులు గురువారం మంచిర్యాల ఆస్పత్రికి తరలించారు. రక్త పరీక్షలు చేసిన వైద్యులు డెంగ్యూ ఉందని నిర్ధారించారు. ప్లేట్‌లేట్స్ తగ్గినందున మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ తరలించాలని సూచించారు. వైద్యుల సూచనల మేరకు కరీంనగర్ తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఏడాది క్రితం కామెర సతీష్ కుమార్‌తో రుచితకు వివాహం జరిగింది.



తల్లిని కోల్పోయిన పసిపాప

12 రోజుల క్రితం బాబుకు జన్మనిచ్చిన రుచిత డెంగ్యూతో మృతి చెందడంతో కుటుంబ సభ్యులతో పాటు దుబ్బపల్లిలో విషాదం చోటు చేసుకుంది.

గడప గడపకు కాంగ్రెస్ పథకాలు



నవతెలంగాణ-రామకృష్ణాపూర్

కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు పల్లె రాజు ఆధ్వర్యంలో శుక్రవారం కనకదుర్గ కాలనీలో గడపగడపకు పథకాలు చేర్చే కార్యక్రమం చేపట్టారు. చెన్నూర్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, పీసీసీ సభ్యులు నూకల రమేష్, పీసీసీ ప్రధాన కార్యదర్శి పిన్నింటి రఘునాథ్‌రెడ్డి ముఖ్య అతిథిగా మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక 6 గ్యారెంటీ పథకాలు అమలు చేస్తుందన్నారు. మహిళలు, రైతులతో పాటు అన్ని వర్గాల ప్రజలకు ఉపయోగపడే ఎన్నో పథకాలు ఉన్నాయని తెలిపారు. ఎమ్మెల్యేగా ఉన్న బాల్క సుమన్ డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు ఇస్తానని మోసం చేశాడని తెలిపారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ పట్టణ అధ్యక్షుడు లాడెన్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు మంత్ రవి, పట్టణ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు రామకృష్ణ, నవీన్, రాజేష్, రాంసాయి, అరవింద్, రాకేష్, దుబ్బుల పోశం, వినయ్, లచ్చన, సోషల్ మీడియా కో ఆర్డినేటర్ రెవెళ్లి శ్రీకాంత్, లచ్చక్క, లక్ష్మి, వెంకటమ్మ పాల్గొన్నారు.

కరెంట్ కోతలు నిసిస్తూ రైతుల ఆందోళన

- జైపూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ ముట్టడి



సబ్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు

నవతెలంగాణ-జైపూర్

వ్యవసాయానికి విద్యుత్ కోతలను నిరసిస్తూ రైతులు ఆందోళన బాట పట్టారు. వ్యవసాయానికి పగలు నాలుగు గంటలు సరఫరా చేస్తూ రాత్రి సరఫరా నిలివేస్తున్నారని గంగపల్లి, పెగడపల్లి, ఎల్కంటి రైతులు శుక్రవారం జైపూర్ సబ్ స్టేషన్ ముట్టడించారు. కోతల కారణంగా పొట్ట దశలో ఉన్న వరి పంట పొలాలు ఎండిపోతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాలు తగ్గుముఖం పట్టడంతో పాటు పగటి పూట ఉష్ణోగ్రతలు పెరిగిపోవడంతో సాగు నీటి సమస్య ఏర్పడి పంట పొలాలు ఎండిపోతున్నాయన్నారు. రైతుల ఇబ్బందులు పట్టించుకోకుండా త్రీఫేజ్ విద్యుత్ సరఫరాలో నిర్లక్ష్యం వహిస్తున్నారని మండిపడ్డారు. పరిస్థితి ఇదేవిధంగా కొనసాగితే పెద్ద ఎత్తున్న ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. ఇప్పటికైనా విద్యుత్ సరఫరాలో కోతలు విధించకుండా చర్యలు తీసుకోవాలని వివిధ గ్రామాల రైతులు కోరుతున్నారు.

వృత్తి శిక్షణ కోర్సులను ప్రారంభం



నవతెలంగాణ-మందమర్రి

సింగరేణి సేవా ఆధ్వర్యంలో వృత్తి శిక్షణ కోర్సులను ఏరియా జీఎం మనోహర్, సేవ అధ్యక్షురాలు సవిత మనోహర్ ప్రారంభించారు. మందమర్రి ఇల్లందు క్లబ్‌లో సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్, మగ్గం వర్క్, బ్యూటిషియన్, జ్యూట్ బ్యాగ్స్ తరగతులను నిర్వహిస్తారు. ఈ సందర్భంగా సేవా సమితి అధ్యక్షురాలు సవిత మనోహర్ మాట్లాడుతూ మహిళలకు ఇస్తున్న కోర్సులను సద్వినియోగం చేసుకొవాలన్నారు. మూడు నెలలు సక్రమంగా నేర్చుకుని ఉపాధి పొందాలని ఆకాంక్షించారు. జీఎం మాట్లాడుతూ సంస్థ లో పనిచేస్తున్న ఉద్యోగుల కుటుంబాలు ఆర్థికంగా నిలబడడానికి ఈ శిక్షణ ఎంతో తోడ్పడుతుందని అన్నారు. సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పర్సనల్ మేనేజర్ ఎస్ శ్యాంసుందర్, డీవైపీఎం ఆసీఫ్, ఎస్ఎస్ఎస్ అండ్ సీసీ కోఆర్డినేటర్స్ నెల్సన్, నరేష్, సేవా సభ్యులు, శిక్షణ టీచర్లు, మహిళలు, యువతులు పాల్గొన్నారు.

హాస్టల్‌తండా జీపీలో డీఎల్పీఓ తనిఖీలు

నవతెలంగాణ-జన్నారం



మండలంలోని హాస్టల్‌తండా గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని శుక్రవారం డిఎల్పిఓ ప్రభాకర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామంలో పర్యటించారు. పంచాయతీలోని పలు రికార్డులను పరిశీలించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామంలో పారిశుధ్య పనులను వేగవంతం చేయాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. మురుగు నీటి కాల్వలను ఎప్పటికప్పుడు శుభ్ర పర్చాలన్నారు. రోడ్లకిరువైపులా ఉన్న పిచ్చి మొక్కలను తొలగించాలన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మంచినీటి సౌకర్యం కల్పించాలని సూచించారు. డంపింగ్ యార్డులో తడి పొడి చెత్తను వేరుగా వేయాలన్నారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆ గ్రామ సర్పంచ్ బాదావత్ జయశ్రీ సంతోష్, కార్యదర్శి, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఫూలే ఆశయ సాధన దిశగా సాగాలి

నవతెలంగాణ-చింతలమానేపల్లి



మహాత్మా జ్యోతిరావు ఫూలే, సావిత్రి బాయి ఫూలే ఆశయ సాధన దిశగా మాలీలు ముందుకు సాగాలని మాలీ సంఘం మండల అధ్యక్షుడు నికోడే బాపురావ్ అన్నారు. శుక్రవారం మాలీల జెండా పండుగ వారోత్సవం సందర్భంగా మండలంలో డబ్బా బారెగుడ గ్రామంలో మాలీ సంఘం గ్రామ అధ్యక్షులు గుర్లే శ్రీనివాస్ జెండాను ఆవిష్కరించారు. ముందుగా మహాత్మా జ్యోతిరావు ఫూలే, సావిత్రి బాయి ఫూలే చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. మాలీ సంఘం మండల అధ్యక్షుడు నికోడే బాపురావు మాట్లాడుతూ మహాత్మా జ్యోతిరావు ఫూలే, సావిత్రి బాయ్ ఫూలే ఆశయ సాధన కొరకు, మాలీ కులస్థులందరు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాలీ సంఘం యువజన మండల కార్యదర్శి టాకిరే బాపురావు, అధ్యక్షుడు గణపతి, బాపురావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నవతెలంగాణ
5
ఆదిలాబాద్
శనివారం | అక్టోబర్ 14, 2023 | www.navatelangana.com

నాయకుల గుండెల్లో గుండి బ్రిడ్జి ఆందోళన

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రస్తుతం నాయకుల గుండెల్లో గుండి బ్రిడ్జి ఆందోళన కలిగిస్తోంది. జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న మండలంలోని గుండివాగుపై 2014లో ప్రారంభమైన పనులు నేటికీ పూర్తి కాకపోవడంతో గత మంగళవారం గ్రామస్తులు పాదయాత్ర నిర్వహించి కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. దీనిలో భాగంగా ఎన్నికలు బహిష్కరిస్తామని హెచ్చరించారు. దీనికి కొనసాగింపుగా తాజాగా గుండి గ్రామస్తులు ఎన్నికలు బహిష్కరిస్తున్నట్లు సామాజిక మాధ్యమాల్లో ఒక ఫ్లెక్సీ చెక్కర్లు కొట్టడం చర్చనీయాంశంగా తయారైంది. అధికార పార్టీకి ఇది మింగుడు పడకపోగా ప్రతిపక్షాలకు ఆయుధంగా మారే అవకాశంగా కనిపిస్తుంది.



నిత్యావసర సరుకులు పంపిణీ

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

పట్టణంలోని ఫాతిమా కాన్వెంట్ హై స్కూల్లో శుక్రవారం లేడీ ఆఫ్ ఫాతిమా ఫీస్ట్ సందర్భంగా పూర్వ విద్యార్థులు, అధ్యాపకులు, స్కూల్ మేనేజ్మెంట్ అధ్వర్యంలో దివ్యాంగులకు, రోగులకు నిత్యవసరాలు, పండ్ల పంపిణీ చేశారు. పేదలకు అండగా సేవ కార్యక్రమాల నిర్వహించడం పట్ల పలువురు అభినందనలు తెలుపుతున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాల్వాయి హరీష్ బాబు పూర్వ విద్యార్థుల సంఘం తరపున హాజరయ్యారు.



ఈసారీ అధికారంలోకి బీఆర్ఎస్



నవతెలంగాణ-లక్ష్మణచాంద

బీఆర్ఎస్ మరోసారి అధికారంలోకి వస్తుందని ఆ పార్టీ మండల కన్వీనర్ కొరిపెల్లి క్రిష్టారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం మండలంలోని చామన్‌పెల్లి, చింతల్‌చాంద, మునిపెల్లి, మల్లాపూర్ గ్రామాలలో బూత్ స్థాయి కమిటీలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు పోటీ చేసే అభ్యర్థులను ప్రకటించే ధమ్ములేని పార్టీలు ఎలా గెలుస్తాయని ప్రశ్నించారు. అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డిని మరోసారి గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు అల్లోల సురేందర్‌రెడ్డి, జడ్పిటిసి ఓస రాజేశ్వర్, జిల్లా కార్యదర్శి అడ్వాల రమేశ్, నాయకులు కోండ్ర నరేశ్‌రెడ్డి, గురాల లింగారెడ్డి, రాంపెల్లి రమేశ్ పాల్గొన్నారు.

తల్లి పాలతోనే పిల్లల ఆరోగ్యం



నవతెలంగాణ-కాసిపేట

తల్లి పాలతోనే పిల్లలకు ఆరోగ్యమని ఐసీడీఎస్ సూపర్వైజర్ రాధిక పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని సోమగూడెం అంగన్వాడీ కేంద్రంలో టీచర్ వకులాదేవి ఆధ్వర్యంలో అన్నప్రసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్వైజర్ రాధిక మాట్లాడుతూ ఆరోగ్యంగా ఉండాలంటే పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. అనంతరం ముందస్తు బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు.

డీపీఓగా ఉమర్ హుస్సేన్ బాధ్యతల స్వీకరణ



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా పంచాయతీ అధికారి(డీపీఓ)గా ఉమర్ హుస్సేన్ శుక్రవారం అదనపు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో గ్రామ పంచాయతీల్లో పారిశుధ్య నిర్వహణ, ఇతర పనుల అభివృద్ధి కోసం కృషి చేస్తానని తెలిపారు. గతంలో డీపీఓగా పనిచేసిన రమేష్‌ను కమీషనర్‌కు సరెండర్ చేయగా ఆయన స్థానంలో డీఆర్డీఓ సురేందర్ అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. నూతనంగా విధుల్లో చేరిన డీపీఓకు పంచాయతీ ఈఓ వంశీకృష్ణ సిబ్బంది సంతోష్, నాగేందర్, వంశీ మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

కళాశాలలో అమృత కలశ యాత్ర



నవతెలంగాణ-బేల

మేరీ మట్టి మేరా దేశ్‌లో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో అమృత కలశ యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం కళాశాల ఆవరణలో మొక్కలు నాటి, విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ అమిడ్‌వార్ వినోద్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ రూపేందర్ రెడ్డి, అధ్యాపకులు వహీద్ ఖాన్, సంతోష్, హరి, నరేందర్‌రెడ్డి, వినాయక్‌రావ్, అపర్ణ, పరిణీత, వినాయక్, సునీల్, స్వామి, సతీష్, దత్తాత్రేయ, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

జ్వరంతో ఇద్దరు మృతి

నవతెలంగాణ-బోథ్

మండలంలోని సాకేర గ్రామానికి చెందిన ఎసుబాయి(40) జ్వరంతో మృతి చెందింది. కుమారుడు రాథోడ్ సచిన్ తెలిపిన వివరాల ప్రకారం.. గత రెండు రోజుల నుంచి జ్వరం రావడంతో బోథ్ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందేందుకు ఆమె ఒక్కరే వెళ్లింది ఆస్పత్రిలో వెళ్లాక ముందే గేటు దగ్గర స్పృహ తప్పి పడిపోయి మృతి చెందింది. గమనించిన స్థానికులు కుటుంబీకులకు సమాచారం అందించారు. భర్త గత మూడు సంవత్సరాల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. మృతురాలి కుమారుడు ఉపాధి కోసం బెంగళూరులో ఓ ప్రయివేటు కంపెనీలో కూలి పని చేస్తున్నాడు.

ఉట్నూర్ : జ్వరంతో మండలంలో దొంగచింత గ్రామానికి చెందిన కనక లక్మన్(33) మృతి చెందారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం మృతుడు గత వారం రోజులుగా జ్వరంతో బాధపడుతున్నాడు. జ్వరం తీవ్రత ఎక్కువగా కావడంతో గురువారం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం రిమ్స్‌కు రెఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

గిరిజనం ముంగిట..నీలగిరి సిరుల పంట..!

- మన్యంలో జోరందుకున్న నీలగిరి సాగు
- మండలంలో జోరుగా ఆగ్రో ఫారెస్ట్రీ తోటల పెంపకం
- వర్షాధారంగా నీలగిరి తోటల సాగుకు రైతుల ఆసక్తి

నవతెలంగాణ-పెంబి

పెంబి మండలం వంటి అటవీ పరిసర గిరిజన ప్రాంతాల్లోని వ్యవసాయ సాగు భూముల్లో పంటలను సాగు చేయడం రైతులకు రోజు రోజుకు ఒక సవాలుగా మారుతుంది. చేతికి అందివచ్చిన పంటలను అడవి పందులు, దుప్పులు, వన్య మృగాలు పాడు చేయడంతో రైతులకు కలుగుతున్న నష్టం ఒక ఎత్తు అయితే సాగు నీటి వసతి లేమి కారణంగా వర్షాధారంగా సంవత్సరంలో కేవలం ఒకే ఒక్క పంటను మాత్రమే సాగు చేయగలగడం రైతుల ఆర్థికాభివృద్ధికి పెను సవాలుగా మారింది. ఈ విపత్కర పరిస్థితులను ఎదుర్కొని రైతుల ఆదాయాన్ని పెంచే దిశగా స్థానిక వ్యవసాయ శాఖ అధికారులు గత సంవత్సర కాలంగా మండలంలో అగ్రో ఫారెస్ట్రీ తోటల పెంపకాన్ని ప్రోత్సహిస్తున్నారు.



వన్య మృగాల నుంచి పంట నష్టాలకు స్వస్తి..

అన్ని రకాల నేలల్లో వర్షాధారంగా సాగు చేయగలిగిన, బహువార్షిక ఆగ్రో ఫారెస్ట్రీ మొక్కలైన నీలగిరి, సుబాబుల్, క్యాజురైనా మొక్కలు అతి తక్కువ కాలంలోనే ఎక్కువ ఎత్తుకు పెరగడం వల్ల అడవి పందులు, దుప్పులు, జింకలు మొదలగు వాటి బారి నుండి తప్పించుకుంటాయి. నీలగిరి మొక్కలు వర్షాభావ పరిస్థితుల్లో కూడా నీటి ఎద్దడిని తట్టుకుని చక్కగా బ్రతకగలుగుతాయి. సాగునీటి వసతి లేని అటవీ పట్టా భూములు కూడా వీటి సాగుకు అనువుగా ఉంటాయి. ప్రస్తుతం అందుబాటులో ఉన్న యూకలిప్టస్ క్లోన్‌లు సుమారు మూడు సంవత్సరాల కాలంలోనే 40 నుంచి 60 టన్నుల కలప దిగుబడిని అందిస్తాయి. కాగా కాజురైనా మొక్కలు రెండున్నర నెలల సమయం లోనే సుమారు 50 టన్నుల కలప దిగుబడిని అందిస్తుంది.

అడవి పందుల బెడద లేదు..

బాణావత్ రూప్‌సింగ్, లోతొర్రె తండా, నీలగిరి రైతు

నాకు ఇటిక్యాల శివారులో నాలుగు ఎకరాల వ్యవసాయ సాగు భూమి ఉంది. గతంలో వర్షాధారంగా పత్తి పంట సాగు చేసే వాడిని. చేను అడవికి దగ్గరలో ఉండటంతో పంటకు అడవి పందుల బెడద అధికంగా ఉండేది. సంవత్సరం కష్టపడితే ఎకరా పత్తి పంట నుంచి కేవలం రూ.15 వేల వరకు మాత్రమే లభించేది. అధికారుల సూచనతో గత సంవత్సరం 4 ఎకరాలలో నీలగిరి తోట వేసుకున్నాను. ప్రస్తుతం పంట ఎదుగుదల బాగుండటంతో మూడు సంవత్సరాలలో రూ.లక్షన్నర నుంచి 2 లక్షల వరకు కలప నుంచి ఆదాయం వస్తుందన్న అంచనా ఉంది.



కలప గుజ్జుకు చాలా డిమాండ్ ఉంది : ఎం. శ్రీధర్, సిర్పూర్ పేపర్ మిల్లు అసిస్టెంట్ మేనేజర్

పేపర్ మిల్లు నిరంతరాయంగా నడవాలంటే రోజుకి సుమారు 1000 టన్నుల కలప గుజ్జు అవసరం అవుతుంది. ప్రస్తుతం తెలంగాణ ప్రాంతంలో పేపర్ తయారీకి కావాల్సిన కలప లభ్యత తక్కువగా ఉండటంతో ఆంధ్ర ప్రాంతం నుంచి అధిక రవాణా ఖర్చులు భరించి కలప కొనుగోలు చేస్తున్నాం. కాలంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రాంతంలో సుమారు 15 వేల ఎకరాల విస్తీర్ణంలో నీలగిరి మొక్కలు సాగు చేయాలని ప్రణాళిక రూపొందిస్తున్నాము. గత దశాబ్ద కాలంలో కలప ధరలో తగ్గుదల నమోదు కాలేదు.



మండల పరిధిలో 150 ఎకరాల నీలగిరి సాగు , బి.రాజ్‌కుమార్, వ్యవసాయ విస్తరణ అధికారి

మండల పరిధిలో సుమారు 150 ఎకరాల విస్తీర్ణంలో నీలగిరి సాగు అవుతుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అగ్రో ఫారెస్ట్రీ తోటల పెంపకానికి సబ్సిడీ అందించడంతో పాటు రైతులకు ఆర్థిక సహకారాన్ని అందిస్తుంది. నీలగిరిలో తొలి ఏడాది పత్తి పంటను అంతర పంటగా తీసుకోవచ్చు. కలుపు యాజమాన్యం అత్యంత ప్రాధాన్యత కలిగి ఉంటుంది. తొలి సంవత్సర కాలం పాటు తోటలో ఎటువంటి కలుపు లేకుండా చూసుకోవాలి. సంవత్సరానికి రెండు సార్లు తోటలో లోతు దుక్కులు దున్నడం వల్ల మొక్కలు యాసంగిలో బెట్ట పరిస్థితులను తట్టుకుంటాయి.

కలప గుజ్జుకు భారీగా పెరుగుతున్న డిమాండ్...

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు సంబంధించి సిర్పూర్ పేపర్ మిల్లులో పేపర్ తయారీకి కావాల్సిన కలప స్థానికంగా అందుబాటులో లేకపోవడంతో కంపెనీ యాజమాన్యం ఒంగోలు, నెల్లూరు, తూర్పుగోదావరి జిల్లాల నుంచి కొనుగోలు చేయడం ద్వారా పరిశ్రమను నిరంతరంగంగా నడిపిస్తున్నారు. పేపర్ తయారీకి కావాల్సిన మొక్కల సాగును స్థానికంగా ప్రోత్సహించడం వల్ల మొక్కల లభ్యత పెరగడంతో పాటుగా సుదూర ప్రాంతాల నుంచి మొక్కల రవాణా కొరకు అయ్యే అనవసర ఖర్చులు తగ్గించుకునే దిశగా కంపెనీ చర్యలు ప్రారంభించిది. ఇందులో భాగంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా సుమారుగా 15వేల ఎకరాల విస్తీర్ణంలో నీలగిరి, సుబాబుల్, కాజురైనా మొక్కల సాగును కంపెనీ ప్రోత్సహిస్తుంది. 2018వ సంవత్సరంలో నీలగిరి ఒకటన్ను కలప ధర రూ.4వేల 400 ఉండగా ప్రస్తుతం టన్నుకు రూ.5వేల100గా ఉంది.

రైతులకు కలిసొస్తున్న రాయితీలు, ప్రోత్సాహకాలు..

పర్యావరణ పరిరక్షణలో భాగంగా పచ్చదనం పెంపొందించే ఉద్యేశంతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అగ్రి ఫారెస్ట్రీ పంటల సాగును ప్రోత్సహిస్తున్నాయి. ప్రభుత్వం ఉపాధిహామీ విభాగం ద్వారా ఈ మొక్కల సాగుకు సంబంధించి మొక్కల కొనుగోలు, రవాణా, గుంతలు తోడటం, నాటడం, ఎరువులు, పురుగుమందుల కొనుగోలు, నీటి యాజమాన్యం తదితరాల కోసం అయ్యే ఖర్చును ఎస్సీ, ఎస్టీ, రైతులకు 100శాతం ఉచితంగా అందిస్తున్నాయి. ఒక ఎకరా నీలగిరి సాగుకు సుమారుగా రూ.30వేల నుంచి రూ.40వేల ఆర్థిక సహకారం ఉపాధి హామీ విభాగం నుంచి రైతులకు లభిస్తుంది. అలాగే కేంద్ర ప్రభుత్వం గ్రీన్ కార్బన్ ఫండ్‌లో భాగంగా కార్బన్ క్రెడిట్ సర్వే ఆధారంగా ఎకరాకు సుమారుగా రూ.10వేలు ఆర్థిక సాయం ఒక పంట కాలం కొరకు రైతులకు అందిస్తుంది. మూడు సంవత్సరాల పంట కాలంలో తొలి ఏడాది అంతర పంటల నుంచి కూడా రైతులు ఆదాయం అర్జించవచ్చు.



జ్వరంతో విద్యార్థిని మృతి

హెచ్ఎం, వార్డెన్ నిర్లక్ష్యంతోనే మృతి చెందిందని ఆరోపణ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

మండలంలోని మామిడిగూడ ఆశ్రమ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థిని రాయిసీడం జంగుబాయి(14) జ్వరంతో బాధపడుతూ శుక్రవారం మరణించిందని తుడుం దెబ్బ జిల్లా ఉపాధ్యక్షుడు కుమ్ర శ్యాంరావు తెలిపారు. శుక్రవారం ఆయన మామిడిగూడ ఆశ్రమపాఠశాలను విద్యార్థిని జ్వరం వస్తుందని హస్టల్ వార్డెన్‌కు తెలుపడంతో ఆశ్రమ పాఠశాలలోని ఏఎన్ఎం మాత్రలు ఇచ్చిందని పేర్కొన్నారు. అయిన జ్వరం తగ్గలేదు. తోటి విద్యార్థినులు తీవ్ర జ్వరం వస్తుందని తెలుపడంతో తండ్రి పాఠశాలకు వచ్చి చూశాడు. అక్కడి సిబ్బందిని అడుగగా జ్వరానికి మాత్రలు



ఇచ్చామని తగ్గిపోతుందని తెలుపడంతో తిరిగి వెళ్లిపోయాడు. మళ్లి రెండు రోజుల తర్వాత తోటి విద్యార్థులు విద్యార్థిని తండ్రికి ఫోన్ చేయడంతో మళ్లి పాఠశాలకు వచ్చి చూశాడు. సిబ్బంది అవసరమైతే మెరుగైన వైద్యం అందించేందుకు రిమ్స్‌కు తీసుకెళతామని తెలుపారు.

10న విద్యార్థిని తండ్రి ఇంటికి తీసుకెళ్లాడు. జ్వరం తీవ్రం కావడంతో శుక్రవారం మరణించింది. ఆశ్రమపాఠశాల హెచ్ఎం, వార్డెన్ నిర్లక్ష్యం కారణంగానే తమ కూతురు మరణించిందని తండ్రి బీర్‌షావ్ పేర్కొన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై చర్యలు తీసుకోవాలని తుడుం దెబ్బ నాయకులు, మామిడిగూడ యూత్ సభ్యులు గణేష్, నందుకుమార్ డిమాండ్ చేశారు.

రాష్ట్ర విద్యా వైజ్ఞానిక మహాసభలను విజయవంతం చేయాలి



నవతెలంగాణ-ఉట్నూర్

ఈ నెల 15, 16, 17న మహబుబ్‌నగర్‌లో నిర్వహించే రాష్ట్ర విద్యా వైజ్ఞానిక 5వ మహాసభలను విజయవంతం చేయాలని డీటీఎఫ్ సంఘం నాయకులు శ్యాముల్, వీరయ్య పిలుపునిచ్చారు. రాష్ట్ర విద్యా వైజ్ఞానిక మహాసభలను విజయవంతం చేయాలని డీటీఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ప్రెస్‌భవన్‌లో పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ మహాసభలలో జాతీయ విద్యావిధానం, సమాజంలో రాజకీయ, ఆర్థిక పరిస్థితులు, వ్యవసాయ రంగం, రైతాంగ ఉద్యమాలు, పాలనలో ప్రజల హక్కులు, సాహిత్యం-మహిళలు, సంస్కృతి రంగంలో తిరోగమన ధోరణులు, పాఠశాలల్లో విద్యారంగంలో సవాళ్లు, కార్పొరేటికరణలో దళితులు, ఆదివాసులు తదితర అంశాలపై చర్చ ఉంటుందన్నారు. ఈ మహాసభలకు అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఈ సంఘ నాయకులు ఉన్నారు.

దళితులకు అన్యాయం జరిగితే సహించేది లేదు

నవతెలంగాణ-ఉట్నూర్

ప్రభుత్వం ప్రవేశపెట్టే సంక్షేమ పథకాల్లో కొందరు పార్టీ నాయకులతో దళితులకు అన్యాయం జరుగుతే సహించేది లేదని దళిత సంఘాల నాయకులు జగ్జివన్, వెంకటేష్, తబితా అన్నారు. దళితలకు వెంటనే దళితబంధును ఇవ్వాలని డిమాండ్‌తో శుక్రవారం స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాలలో దళితబంధు రెండో విడత లబ్ధిదారుల లిస్ట్‌ను ఫైనల్ చేస్తూ కలెక్టర్‌ల ద్వారా అమోదించడం జరిగిందని, కేవలం ఖానాపూర్ నియోజకవర్గం దళితబంధు లిస్ట్‌ను ఆమోదం చేయకుండా తాత్సర్యం చేయడం సమంజసం కాదన్నారు. నియోజకవర్గంలోని ఉట్నూర్ మండలంలోని దళితులకు అన్యాయం చేయడం అన్యాయమన్నారు. వెంటనే ప్రభుత్వం, నాయకులు చొరవ తీసుకొని జాబితాను రెండు, మూడు రోజుల్లో అమోదించకపోతే మండల దళితులమంతా ముకుమ్మడి పార్టీకి రాజీనామా చేస్తామని హెచ్చరించారు. అనంతరం డాక్టర్ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘం నాయకులు ఉన్నారు.



కాంగ్రెస్‌లోకి జోరందుకున్న చేరికలు



నవతెలంగాణ-సారంగాపూర్

కాంగ్రెస్ పార్టీలోకి చేరికలు జోరందుకున్నాయి. శుక్రవారం కాంగ్రెస్ కార్యాలయంలో శ్రీహరిరావు సమక్షంలో మండలంలోని సాయినగర్ తండాకు చెందిన పలువురు నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్‌కు రోజు రోజు ప్రజాదరణ పెరుగుతోందని అన్నారు. రాబోయే ఎన్నికల్లో అధికారంలోకి రావడం ఖాయమన్నారు. అన్ని వర్గాల ప్రజల అభివృద్ధే ధ్యేయంగా కాంగ్రెస్ పాలన ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో భోల్లోజీ నర్సయ్య, విలాస్ రావు, ఎస్ కె సలీం, రాజేందర్, అరవింద్ ఉన్నారు.

ఘనంగా ఫ్రెషర్స్‌డే వేడుకలు

నవతెలంగాణ-మందమర్రి

మందమర్రి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల మందమర్రి లోని మొదటి సంవత్సరం విద్యార్థులకు, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఫ్రెషర్స్ డే పార్టీని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆటపాటలతో విద్యార్థులు హోరెత్తించారు. కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా చెన్నూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ నాగ చందర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఎం.కృష్ణయ్య విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులందరూ ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని కష్టపడి విద్యను అభ్యశించాలని, మంచి మార్కులతో రాష్ట్ర స్థాయిలో రాణించాలని అన్నారు. జీవితంలో ఉన్నత పదవులు అలంకరించాలని సూచించారు. విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు అందరినీ ఆకట్టుకోగా, కళాశాల ఆంగ్ల అధ్యాపకులు నరసింహ, రికార్డు అసిస్టెంట్ రవీందర్‌లు పాడిన పాటలు కార్యక్రమానికే ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో ఉషారాణి, రామయ్య, రాజమల్లు, చంద్రకళ, జగన్ మోహన్, మహేష్, ప్రభాకర్ పాల్గొన్నారు.



పోలీసుల తనిఖీల్లో పట్టుబడ్డ నగదు

దిలావర్‌పూర్ : నర్సాపూర్(జి) పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం పోలీసుల తనిఖీల్లో భాగంగా నగదు పట్టుబడింది. ఎస్సై రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఎన్నికల నేపథ్యంలో పోలీసుల తనిఖీల్లో భాగంగా నర్సాపూర్(జి) బస్ స్టాప్ వద్ద రాత్రి ఏడున్నర గంటల సమయంలో పోలీసు సిబ్బంది వాహనాలు తనిఖీలు చేస్తుండగా ఆర్మూర్‌కు చెందిన గంగామోహన్ వద్ద ఎలాంటి పత్రాలు లేకుండా డబ్బును తీసుకెళ్తుండగా రూ.1.18 లక్షల నగదును పట్టుకుని, స్వాధీనం చేసుకొని, సీటీఓ నిర్మల్‌కు పంపామని ఎస్సై తెలిపారు.